ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY ఖమ్మం KHAMMAM
బుధవారం 12 నవంబరు 2025



మొక్కజొన్న కొనుగోళ్లకు సై

- ఉమ్మడి జిల్లాలో 11 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి

ఖమ్మం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో మొక్కజొన్న రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాల ఏర్పాటుచేసింది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆదేశాలతో ఉమ్మడిజిల్లాలో 11 కేంద్రాలను ప్రారంభించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు లక్షపైగా ఎకరాల్లో వానాకాలం కింద మొక్కజొన్న సాగు చేశారు. కొన్నిచోట్ల వర్షాలకు పంటతో పాటు నాణ్యత కూడా

(మిగతా 6వ పేజీలో)

పత్తి కొనుగోలు ప్రక్రియను వేగిరం చేయాలి

సీసీఐ కేంద్రాల ఆకస్మిక తనిఖీలో కలెక్టర్ అనుదీప్ 7



మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి అర్పిస్తున్న కలెక్టర్ అనుదీప్, అదనపు కలెక్టర్ శ్రీజ తదితరులు

విద్యతోనే పేదరికానికి విముక్తి

జాతీయ విద్యా దినోత్సవంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యతోనే పేదరికం నుంచి విముక్తి లభిస్తుందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పేర్కొన్నారు. మైనారిటీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మొట్ట మొదటి నెహ్రూ నాయకత్వంలోని మంత్రివర్గంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారని, ఆయన పుట్టినరోజు సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హిందీ, (మిగతా 8వ పేజీలో)



వృత్తి నైపుణ్యాలకు.. తిలోదకాలు!



“ **ఉన్నత చదువులకు** అవకాశం లేని బలహీన వర్గాల విద్యార్థులతో పాటు 10వ తరగతి అనంతరం తన భవిష్యత్తుకు బాట వేసుకునే వారి కోసం ప్రభుత్వం వృత్తి విద్యా కోర్సులను ప్రవేశపెట్టింది. ఆచరణాత్మక శిక్షణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఆచరణాత్మకమైన శిక్షణ అందించడం కోసం ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (ఐటీఐ) ఏర్పాటు చేశారు. నైపుణ్యం కలిగిన నిపుణలను తయారు చేయడం కోసం ఈ కళాశాల ఏర్పాటు చేశారు. తాము నేర్చుకున్న నైపుణ్యాలతో ప్రభుత్వ ఉద్యోగం లేదా స్వయం ఉపాధి కోసం సహకరించే వృత్తి విద్యా కేంద్రాలు నేడు లైసెన్స్ సర్టిఫికెట్ జారీ కేంద్రాలుగా మారాయి. ఐటీఐలతో పాటు ఇంజనీరింగ్, ఫార్మసీ, పాలిటెక్నిక్ కళాశాలలో చదివిన విద్యార్థులకు సరైన నైపుణ్యాలు లేకపోవడంతో ఏటా వేల సంఖ్యలో నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు. ”



ఐటీఐ వర్క్‌షాప్‌లో విద్యార్థినులు

- లైసెన్స్ సర్టిఫికెట్ల జారీ కేంద్రాలుగా ఐటీఐలు
- ఏటికేడు పెరిగిపోతున్న నిరుద్యోగులు
- నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు : ఐటీఐ ప్రిన్సిపాల్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 24 ఐటీఐలు ఉండగా.. వీటిలో మూడు ప్రభుత్వ, 21 ప్రైవేట్ ఐటీఐ కళాశాలలున్నాయి. జిల్లాలో ఏటా ఐదు నుంచి 6 వేల మంది విద్యార్థులు బయటికి వస్తున్నారు. వీరిలో కనీసం 10 శాతం మంది కూడా వృత్తి విద్యలో రాణించలేకపోతున్నారు. ముఖ్యంగా ప్రైవేట్ కళాశాలలో సరిగా వ ర్క్ షాప్‌లు, ప్రాక్టికల్ నిర్వహణ నామమాత్రంగా కేవలం పరీక్షల కోసమే నేర్చుకుంటున్నారన్న విమర్శలు లేకపోలేదు. సరైన వృత్తి నైపుణ్యం లేకపోవడం వల్ల వేలాది మంది నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారు.

ప్రస్తుతం ఉన్న వృత్తి విద్యా కోర్సులు..

ప్రస్తుతం భద్రాద్రి జిల్లాలోని 24 ఐటీఐ కేంద్రాల్లో వివిధ రకాలైన వృత్తి విద్యా కోర్సులు అందిస్తున్నారు. వెల్డింగ్, డ్రాఫ్ట్ మాన్ సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ డీజి ల్, పెట్రోల్, ఫిట్టర్, టర్నర్, పెయింటర్, కంప్యూటర్ ఆపరేటర్, తదితర కోర్సులు అందిస్తున్నారు. ఈ కోర్సుల కాల పరిమితి రెండేళ్లు ఉంటుంది. ప్రస్తుతం మా ర్కెట్‌కు అవసరమైన కోర్సులు లేకపోవడం విద్యార్థులకు శాపంగా మారింది. ఫీజు లు విషయంలో ఒక్కో కోర్సుకు కళాశాలను బట్టి ఏడాదికి రూ.5వేల నుంచి రూ.16వేల వరకు ఉన్నాయి. స్కాలర్‌షిప్ తో పాటు అదనంగా వేలాది రూపాయలు విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పారిశ్రా మిక కేంద్రమైన భద్రాద్రి జిల్లాలోని పరిశ్రమల్లో వివిధ రకాలైన వృత్తి నైపుణ్యాల కు ప్రాధాన్యమిస్తున్నారు. జిల్లాలో పలు ప్రైవేట్ ఐటీఐ కేంద్రాల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతానికి అధికంగా ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రాక్టికల్స్ అనేవి కేవలం కోర్సు చివర్లో అవసరమైన ప్రాక్టికల్స్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. సబ్జెక్టులకు సంబంధించిన మొత్తం ప్రాక్టికల్స్‌కు అంతగా ప్రాముఖ్యత ఇవ్వడం లేదు. కేవలం చివరి ప్రాక్టికల్స్‌కు అధిక ప్రాముఖ్యత ఇస్తున్నారు. పరీక్షలకు పరిశీలకులుగా వచ్చే వారి చేతులు తడిపితే సరిపోతుంది.. అన్న విమర్శలు సర్వత్రా వినవస్తున్నాయి.

మార్కెట్లో డిమాండ్లు ఉన్న వృత్తి విద్యా కోర్సులు

జిల్లాలోని కొన్ని ఐటీఐలు మార్కెట్లో డిమాండ్ ఉన్న వృత్తి విద్యా కోర్సులకి ప్రాధాన్యమిస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో ఎలక్ట్రికల్, ఫిట్టర్, డ్రాఫ్ట్ మెన్ సివిల్, మెకానికల్ పెట్రోలియం, డీజిల్, ఆర్టిఫిషియల్ కోర్సులు, సోలార్ టెక్నికల్, డిజిటల్ మార్కెటింగ్, సీఎంసీ ప్రోగ్రాం ఆపరేటర్, ఆటోమేటివ్ ఎలక్ట్రిషన్, డయాగ్నస్టిక్స్, మొబైల్ రిపేరింగ్, సీసీటీవీ ఇన్‌స్టాలేషన్, కంప్యూటర్ ఆపరేటర్, హార్డ్వేర్, తదితర కోర్సులకు మార్కెట్లో ఎక్కువ డిమాండ్ ఉందని వృత్తి విద్యా విషయం నిపుణులు తెలియజేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నెలకొన్న పరిశ్రమలకు అవసరమైన వృత్తి నైపుణ్య కోర్సులు నేర్చుకుంటే ఎక్కువ ఉపాధి అవకాశాలు లభిస్తాయి. స్థానిక పరిశ్రమంలోనే అప్రెంటిస్ చేయడం వల్ల తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవడానికి ఉపయోగపడుతుంది.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

రమేష్ (ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్)

ఐటీఐలు వృత్తి రీత్యా విద్యార్థులకు మార్గం చూపేవిగా ఉండాలి. విద్యార్థుల ఎంపిక చేసుకున్న కోర్సులపై సబ్జెక్టు, ప్రాక్టికల్స్ పరంగా న్యాయం చేసేలా అవగాహన కల్పించాలి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఐటీఐలపై చర్యలు తప్పవు. ప్రాక్టికల్స్ లో నూరు శాతం న్యాయం చేయాలి. సీటీటీ పరీక్షలపై విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగించి ప్రాక్టీస్ చేయించాలి. ప్రాక్టికల్స్ పరీక్షలపై పర్యవేక్షణ పటిష్ఠంగా ఉంటుందని విద్యార్థుల హాజరు, ప్రాక్టికల్స్ సబ్జెక్టు బోధన, ఫీజులు వసూళ్ల తదితర వాటికి సంబంధించిన రికార్డులు కచ్చితంగా ఉండాలి. ప్రాక్టికల్, రాత పరీక్షల్లో మాల్ ఎవరైనా ప్రాక్టీస్‌కు పాల్పడితే ఆ కళాశాలపై చర్యలు తీసుకుంటాం.

నువ్వా నేనా ?



- ఇల్లెందు బీఆర్‌ఎస్‌లో రేగా వర్సెస్ హరిప్రియ
- పోటాపోటీగా కార్యవర్గ నియామకాలు
- వేర్వేరుగా అధ్యక్షుల పేర్లు ప్రకటన
- విస్తుపోతున్న గులాబీ శ్రేణులు

ఇల్లెందు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి)

ఇల్లెందు నియోజకవర్గంలో రెండు వర్గాలుగా నిలువునా చీలి కార్యకలాపాలు సాగిస్తున్న బీఆర్‌ఎస్‌లో మరోమారు సిగపట్లు మొదలయ్యాయి. పార్టీ ముఖ్య నేతలు నువ్వా.. నేనా!? అన్నట్టుగా ఢీ అంటే ఢీ అంటున్నారు. బీఆర్‌ఎస్ ఇల్లెందు పట్టణ అధ్యక్షుడిగా దిండిగాల వర్గానికి చెందిన మహమ్మద్ జబ్బార్‌ను పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ప్రకటించగా.. ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాణోతు హరిప్రియ తన వర్గీయుడైన సిలివేరు సత్యనారాయణను అధ్యక్షుడిగా ప్రకటించారు. దీంతో మరోసారి బీఆర్‌ఎస్‌లో వర్గ కలహాలు బజారుకెక్కాయి. కొద్ది నెలలుగా సెగ్మెంట్ అంతటా మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు దిండిగాల రాజేందర్‌లు రెండు వర్గాలుగా చీలిపోయి.. పార్టీ పిలుపు కార్యక్రమాలు, ఆందోళనలు వేర్వేరుగా నిర్వహిస్తున్నారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత క్యాడర్‌ను హరిప్రియ పట్టించుకోవడం లేదంటూ దిండిగాల రాజేందర్ వర్గీయులు సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య సంజీవ్‌నాయక్‌ను రంగంలోకి దింపారు. కొద్ది నెలలుగా నియోజకవర్గంలో దిండిగాల వర్గం నిర్వహిస్తున్న పార్టీ కార్యక్రమాలకు సంజీవ్ నాయక్‌ను ఆహ్వానిస్తుండడంతో.. అప్రమత్తమైన మాజీ ఎమ్మెల్యే హరిప్రియ తన అనుచరులను, అభిమానులను కాపాడుకునేందుకు నడుం బిగించారు. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ ఆందోళనలను హరిప్రియ, దిండిగాల అనుచరులు, మద్దతుదారులు వేర్వేరుగా నిర్వహిస్తున్నారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా తానే పోటీలో ఉంటానన్న ధీమాతో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జీగా వివిధ మండలాలు సందర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ అనూహ్యంగా దిండిగాల వర్గం సంజీవ్‌నాయక్‌ను ఇల్లెందు నియోజకవర్గ కార్యక్రమాల్లో భాగస్వామిని చేస్తుండడంతో.. ఇరువర్గాల మధ్య తీవ్ర స్థాయిలో విభేదాలు కొనసాగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో పరస్పర దూషణలు, బెదిరింపులకు సైతం పూనుకోవడం గమనార్హం. తాజాగా జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్‌లో ఖాళీగా ఉన్న మండల, పట్టణ, అధ్యక్షుల నియామకాలను జరిపిన బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఎండి.జబ్బార్‌ను మంగళవారం ఇల్లెందు పట్టణ అధ్యక్షుడిగా నియమించారు. ఈ సమాచారం తెలియడంతో మాజీ ఎమ్మెల్యే హరిప్రియ తన వర్గానికి చెందిన సిలివేరు సత్యనారాయణను పట్టణ అధ్యక్షుడిగా నియమిస్తూ నియామక పత్రం జారీ చేశారు. బీఆర్‌ఎస్‌లో ఉత్పన్నమైన తాజా పరిణామాలతో పాటు గత కొద్ది కాలంగా నియోజకవర్గంలో పార్టీ నాయకుల పని విధానాలపై దిండిగాల, హరిప్రియ పరస్పరం రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదు చేసుకున్నారు. ఈ క్రమంలో ఇల్లెందు పట్టణ అధ్యక్షుడిగా ఇద్దరిలో రాష్ట్ర నాయకత్వం ఎవరిని అధ్యక్షుడిగా కొనసాగిస్తుందోనన్న ఉత్కంఠ బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నెలకొంది. అధికారం కోల్పోయి బీఆర్‌ఎస్‌లో కొనసాగడమే క్లిష్టంగా ఉన్న సమయంలో తాము ధైర్యంగా కేసీఆర్, కేటీఆర్‌ల నాయకత్వంపై విశ్వాసంతో పార్టీ నిర్మాణంలో, కార్యక్రమాల్లో పాల్గొంటున్నామని పార్టీ శ్రేణులు చెబుతున్నారు. కానీ పెత్తనం కోసం ఇల్లెందు నియోజకవర్గ నాయకులు పలు ప్రయత్నాలు చేస్తున్నారని.. ఈ క్రమంలో పార్టీ నాయకత్వం ఇల్లెందు నియోజకవర్గంపై దృష్టి సారించాలని పార్టీ శ్రేణులు రాష్ట్ర నాయకులకు విజ్ఞప్తులు చేస్తూ మెసేజ్‌లు పంపుతుండడం గమనార్హం. ఇదిలా ఉండగా.. పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. జిల్లాలో ఖాళీగా ఉన్న అధ్యక్ష పదవులను భర్తీ చేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశించారన్నారు. ఈ మేరకే పార్టీలో క్రమశిక్షణతో ధైర్యంగా కొనసాగుతున్న అంశాలను పరిగణనలోకి తీసుకొని ఎండి.జబ్బార్‌ను పట్టణ అధ్యక్షుడిగా నియమించడం జరిగిందన్నారు. మరోవైపు.. నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియను సంప్రదించకుండా పట్టణ అధ్యక్ష నియామకం ఎలా చేస్తారని ఆమె వర్గీయులు ఆగ్రహావేశాలను వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిణామాలతో నికార్సైన గులాబీ శ్రేణులు ఎటూ పాలుపోని రీతిలో కొట్టుమిట్టాడుతున్నాయి.

ఆకస్మిక తనిఖీలు చేస్తా



- పాఠశాల స్థాయిలో పరిస్థితి తెలుసుకుంటా
- మెరుగైన ఫలితాల సాధనకు కృషి
- 'ఆంధ్రజ్యోతి'తో డీఈవో చైతన్యజైని

ఖమ్మం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : జిల్లాలోని పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి క్షేత్రస్థాయిలో పరిస్థితిని తెలుసుకుని విద్యావ్యవస్థను మరింత పటిష్ఠం చేయడంతో పాటు మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషిచేస్తానని జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్యజైనీ తెలిపారు. మంగళవారం డీఈవోగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమె 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. జిల్లాలో మొత్తం ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి గురించి తెలుసుకుని తదుపరి విద్యాభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు. ప్రస్తుతం విద్యాసంవత్సరం సగం వరకు పూర్తయినందున, రాబోయేది పరీక్షల కాలం కావడంతో అందుకు అనుగుణంగా మెరుగైన ఫలితాలు సాధించేందుకు చర్యలు చేపడతామన్నారు. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్, సైన్సు, గణితం సబ్జెక్టుల్లో విద్యార్థులు రాణించేలా, స్పోకెన్ ఇంగ్లీష్‌లో పిల్లలు రాణించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుశాతంపై రోజువారీగా సమీక్షించి గైర్హాజరు శాతం ఎక్కువ ఉన్నచోట చర్యలు చేపడతామన్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనతోపాటు ఉన్న సదుపాయాలతోనే చదువుల్లో రాణించే విధంగా కార్యచరణ చేపడతామని, ముందుగా అన్ని మండలాల్లో ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించి క్షేత్రస్థాయిలో పరిస్థితిని తెలుసుకుని దానికి అనుగుణంగా ప్రణాళిక రూపొందిస్తానని వివరించారు.

ఈ ఏడాది 4.69కోట్ల క్యూసెక్కులు

- ఇదీ ఈసారి దిగువకు ప్రవహించిన గోదావరి నీటి లెక్కలు
- గత రెండేళ్లతో పోలిస్తే ఇదే అత్యధికం



2022 జూలై 16న భద్రాచలం వద్ద 71.3 అడుగుల వద్ద ప్రవహించిన గోదావరి

భద్రాచలం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గోదావరి సాధారణ రోజుల్లో సెలయేటిని తలపిస్తూ ఇసుక తిన్నెలు, రాళ్లగుట్టలతో దర్శనమిస్తుంది. అదే వర్షాకాలంలో.. వరదల సమయంలో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తూ ఉంటుంది. ప్రధానంగా జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో గోదావరికి వరదల తాకిడి అధికంగా ఉంటుంది. ఈ క్రమంలో ఈ ఏడాది భద్రాచలం వద్ద గోదావరి 4.69 కోట్ల క్యూసెక్కులపైనే దిగువకు ప్రకవహించిందని కేంద్ర జలసంఘం అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. గత రెండేళ్లతో పోలిస్తే ఈ సారి దిగువకు ప్రవహించిన వరద ప్రవాహమే అత్యధికంగా ఉంది. అయి తే 2022లో వచ్చిన గోదావరి మహావరదలతో పోలిస్తే మాత్రం ఈ ఏడాది ప్రవహించిన వరద రెండో స్థానంలో నిలిచింది. 2022లో 8.58కోట్ల క్యూసెక్కు ల వరద రాగా.. 2023లో 3.01కోట్ల క్యూసెక్కులు, 2024లో 3.83 కోట్ల క్యూసెక్కుల వరద దిగువకు ప్రవహించినట్లు లెక్కలు చెబుతున్నాయి.

2022లో 8.58కోట్ల క్యూసెక్కులు

2022లో గోదావరి 8.58 కోట్ల క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహించింది. దీనికి ప్రధాన కారణం 2022 జూలై 16న 71.3 అడుగుల నీటిమట్టం నమోదైంది. గత 32 ఏళ్లలో ఇదే అత్యధిక నీటిమట్టంగా నిలిచింది. ఆ నెలలో 2.66 కోట్ల క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహించినట్లు అధికారులు గుర్తించారు. అలాగే ఆగస్టులో 3.20కోట్లు, సెప్టెంబరులో 2.17కోట్ల క్యూసెక్కులు దిగువకు వెళ్లగా మొత్తంగా ఆ ఏడాది 8.58కోట్ల క్యూసెక్కుల వరద దిగువకు ప్రవహించింది. కాగా.. ఈసారి గోదావరి వరద తీవ్రత తక్కువగా ఉన్న వరద నీరు మొదటి ప్రమాద హెచ్చరికను ఎక్కువసార్లు (మిగతా 6వ పేజీలో)



దీక్షిత్ నాయక్ (ఫైల్)

స్కూల్ బస్సు కిందపడి చిన్నారి మృతి

- ఆడుకుంటూ వెళ్లి వెనుకచక్రాల కింద పడిన దీక్షిత్
- చంద్రుగొండలోని కరిసలబోడుతండాలో విషాదం
- తమ్ముడి మృతితో వీడిన కవలల బంధం

7





జైశ్రీరామ్ అచ్చుతో తయారు చేసిన నమూనా ఇటుకలు.. పరిశీలిస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్, అధికారులు

భద్రాద్రిలో జైశ్రీరామ్ ఇటుకలు

- భక్తుల చేతుల మీదుగా తయారీకి చర్యలు
- బెంగళూరు నుంచి మోల్డ్‌లను తెప్పించిన కలెక్టర్

భద్రాచలం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దక్షిణ అయోధ్య భద్రగిరిలో 'జై శ్రీరామ్' అచ్చుతో ఇటుకలను తయారు చేసేందుకు అవసరమైన చర్యలను ప్రారంభించారు. ఈ క్రమంలో బెంగళూరు నుంచి ప్రత్యేకంగా తెప్పించిన మోల్డ్‌లను భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్‌వి పాటిల్ పరిశీలించారు. అనంతరం మంగళవారం నమూనాగా ఇటుకలను భక్తులతో తయారు చేయించారు. రామయ్య దర్శనానికి వచ్చే భక్తుల్లో ఆసక్తి కలిగిన వారితో, ఇటుకలను కొనుగోలు చేసే భక్తులతో స్వచ్ఛందంగా ఈ ఇటుకలను తయారు చేయించేలా కార్యాచరణ రూపొందించి, అమలు చేసే విషయమై కలెక్టర్ దేవస్థానం ఈవో దామోదర్ రావుతో చర్చించారు. అయితే ఇలా జైశ్రీరామ్ పేరుతో తయారు చేసిన ఇటుకలను త్వరలో రామాలయంలో ఉంచి రామయ్య దర్శనానికి వచ్చిన భక్తులకు విక్రయించనున్నారు. రామానుగ్రహంగా విక్రయించే ఇటుకల్లో 100రూపాయలకు రెండు ఇటుకల చొప్పున భక్తులకు అమ్మనున్నారని సమాచారం.

24 నుంచి సింగరేణి అధికారుల నిరాహార దీక్ష

పీఆర్‌పీ సాధనకు ప్రత్యక్షంగా ఆందోళన బాట



కొత్తగూడెంలో జీఎంకు డిమాండ్ల పత్రాన్ని సమర్పించిన అధికారులు

ఇల్లెందు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్‌లో ఉత్పత్తి లక్ష్యాల సాధనతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలకే తలమానికంగా సింగరేణి ప్రస్థానం కొనసాగడానికి కారకులైన సింగరేణి అధికారులు అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఉత్పత్తి ఉత్పాదకతలు సాధిస్తూ సంస్థ ను రూ.వేల కోట్ల లాభాల బాటలో పయనింపజే యడంలో కీలకపాత్ర పోషిస్తున్న అధికారులు తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మికులకు ఇస్తున్న ప్రాధాన్యం కూడా సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం తమకు ఇవ్వడం లేదని ఆగ్రహోదులవుతున్నారు. ఏడాది కాలంగా సింగరేణి యాజమాన్యాన్ని వేతనాల్లో భాగమైన పర్మార్మెన్స్ రిలేటెడ్ పే (పీఆర్‌పీ) చెల్లింపులు జరపాలని కోరుతున్నా, హైకోర్టు ఆదేశించినా రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెడుతుండటంతో గత్యంతరం లేక ప్రత్యక్ష ఉద్యమాలకు పూనుకోవాలని సింగరేణి అధికారుల సంఘం నిర్ణయించింది. కొద్ది నెలల క్రితమే నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు వ్యక్తం చేసిన అధికారులు తమ ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు యత్నించగా సింగరేణి సీఎండీ హామీ ఇవ్వడంతో ఆందోళనలు నిలిపివేశారు. అయితే సీఎండీ హామీ ఇచ్చి కూడా మూడు నెలలు దాటుతున్నా అటు సింగరేణి యాజమా న్యం, ఇటు రాష్ట్ర ప్రభుత్వంలో ఉలుకూ పలుకు లేకపోవడంతో పీఆర్‌పీ ఊసే ఎత్తకపోవడంతో సింగరేణి వ్యాప్తంగా రెండో దశ ఆందోళనలకు దిగాలని కోల్ మైన్ ఆఫీసర్స్ అసోసియేషన్ (సీఎంవోఏఐ) సింగరేణి విభాగం పిలుపునిచ్చిం ది. ఫలితంగా గత రెండు రోజులుగా సింగరేణి వ్యాపితంగా అన్ని ఏరియాల్లో అధికారులు స్థాని క జనరల్ మేనేజర్లకు, ఉన్నతాధికారులకు తమ డిమాండ్ల సాధనకోసం ప్రత్యక్ష ఆందోళనలకు పూనుకుంటున్నట్లు వినతి పత్రాలు, ఆందోళనల నోటీసులు సమర్పించారు.

24 నుంచి నిరాహార దీక్షలకు..

రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి యాజమాన్యం అధికారుల సమస్యలు పట్టించుకోవడం లేదంటూ ఈ నెల 24 నుంచి అన్ని ఏరియాల్లో నిరాహార దీక్షలు ప్రారంభించాలని అధికారుల సంఘం పిలుపునిచ్చింది. డిసెంబరు 1 నుంచి సింగరేణి వ్యాప్తంగా వర్క్ టూ రూల్ పాటించాలని పిలుపునిచ్చింది. వేతనాల్లో భాగమైన పీఆర్‌పీల చెల్లింపుల జాప్యంపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ యాజమాన్యానికి లేక సమర్పించింది. కనీసం గని కార్మికులకు ఇస్తున్న ప్రాధాన్యత కూడా అధికారులకు లభించడం లేదని ఉత్పత్తి, ఉత్పాదకతల్లో కీలకమైన సింగరేణి అధికారులనే ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

లాభాలు ఆర్జిస్తున్నా అధికారుల గోడు పట్టదా..

సింగరేణి బొగ్గుగనుల్లో కార్మికులు అధికారులు సమన్వయంతో సమష్టి కృషితో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధిస్తూ ఏటా వేలాది కోట్ల లాభాలను సంస్థ గడిస్తోంది. అధికారులు, కార్మికుల కష్టార్జితాన్ని ప్రభుత్వం వివిధ పథకాలకు మళ్లించుకుంటున్నా, సింగరేణి సీఎస్‌ఆర్ నిధుల పేరిట కోల్ బెల్ట్ ఏరియాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలకు రూ.కోట్లు ముట్టచెబుతున్నా అధికారులు, కార్మికులు నోరు మెదపడం లేదు. అంతేకాక గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తరహాలోనే నూతన కాంగ్రె స్ ప్రభుత్వం ప్రభుత్వ నిధులతో చేపట్టవలసిన పథకాల, కార్యక్రమాలకు సింగరేణి నిధులను తీసుకుంటూ చెమటోడ్చి రేయింబవళ్లు శ్రమించి సింగరేణికి లాభాలు సాధించడంలో కీలక పాత్ర వహించిన అధికారుల గోడు పట్టించుకోవడం లేదన్న ఆగ్రహావేశాలను అధికారులు వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి గత ఆర్థిక సంవత్సరంలో సాధించిన లాభాల్లో 40 వేల మంది కార్మికులకు 33 శాతం వాటాగా రూ.796.05 కోట్లు స్పెషల్ ఇన్సెంటివ్‌గా, 25 వేల కాంట్రాక్టు కార్మికులకు రూ.5వేల చొప్పున చెల్లించిన ప్రభుత్వం సింగరేణి యాజమాన్యం కేవలం సింగరేణిలో పనిచేస్తు న్న 2300మంది అధికారులకు ఏళ్ల తరబడి పీఆర్‌పీలు చెల్లించకపోడాన్ని అధికారుల కుటుంబా లు నిలదీస్తున్నాయి. అధికారులపై ఎందుకు వివక్ష చూపుతున్నారని ప్రశ్నిస్తున్నాయి.

అధికారుల సంఘం డిమాండ్ ఏంటంటే..

కోల్ ఇండియా అనుబంధ బొగ్గు గనుల్లో అధికారులకు వేతనాల్లో భాగంగా చెల్లించిన పీఆర్‌పీలు సింగరేణిలో కూడా వెంటనే చెల్లించాలని కోల్ మైన్ ఆఫీసర్స్ అసోసియేషన్ కోరుతోంది. 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల పీఆర్‌పీలు చెల్లించాలని, 2007-08 నుండి 2013 -14 వరకు పీఆర్‌పి బకాయిలు విడుదల చేయాలని అధికారులు కోరుతున్నారు. అదేవిదంగా కార్మికుల మాదిరిగా తమ క్వార్టర్లు, నివాసాలకు కూడా ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని, కార్మికుల పిల్లల మాదిరిగా తమ పిల్లలకు కూడా ఐఐటీ, ఐఐఎంలలో చదువుతున్న వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయాలని, ప్రమోషన్ల పాలసీని పారదర్శకంగా చేపట్టాలని సింగరేణి అధికారులు కోరుతున్నారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని అధికారుల సంఘం వెల్లడించింది.

భద్రాద్రి వైద్యశాల ఆదర్శంగా నిలవాలి

వైద్యశాలలో పారిశుధ్య నిర్వహణ సరిగా లేదు..!

మెరుగైన వైద్య సేవల కోసం ఆధునీకరణ చర్యలు అవసరం

భద్రాచలం ఏరియా వైద్యశాలను సందర్శించిన భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్



వైద్యశాలలో ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలిస్తున్న భద్రాద్రి కలెక్టర్

భద్రాచలం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో పారిశుధ్య నిర్వహణ సరిగా లేదని, వైద్యశాలలోని వార్డుల్లో స్లాబ్ పెచ్చులూడటంపై మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ జితేష్‌వి పాటిల్ అన్నారు. భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలను కలెక్టర్ జితేష్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యశాలలో వార్డులను ఆయన పరిశీలించి పారిశుధ్య చర్యలు సరిగా లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రి భవనం పైభాగంలో నీటి లీకేజీని గమనించిన కలెక్టర్ ఇంజనీరింగు అధికారులను పిలిచి వెంటనే లీకేజీ నివారణకు తక్షణచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయన ప్రసూతి విభాగం, శిశు సంరక్షణ విభాగం, అత్యవసర వైద్య విభాగం వార్డులను పరిశీలించి అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తంచేశారు. సీఆర్‌ఎం కామన్ రివ్యూ మిషన్ బృందం సభ్యులు భద్రాచలం ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారని అన్నారు. వైద్యాధికారులు, సిబ్బంది బాధ్యతతో పని చేయడం వలన జిల్లాకు మంచి పేరు వస్తుందని ఇదే స్ఫూర్తితో వైద్యాధికారులు పని చేసి ప్రజల మన్ననలు పొందాలన్నారు. వైద్యశాలలో ఐసీయూ నిర్వహణ, ఆపరేషన్ థియేటర్ సేవలు బాగున్నాయని తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలందిచేందుకు వైద్యశాలలో ఆధునీకరణ సేవలు అత్యవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. ఆపరేషన్ థియేటర్ విభాగంను పరిశీలించి ఆధునీకరణ కోసం అవసరమైన అత్యాధునిక పరికరాలు, సాంకేతక వినియోగం, ప్రస్తుత సదుపాయాల బలోపేతం వంటి అంశాలపై వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణ, వైద్య సిబ్బందితో చర్చించారు. ఈ సమయంలో వైద్యశాలలో సిబ్బంది కొరతను సూపరింటెండెంట్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన కలెక్టర్ జిల్లా ప్రధాన ఆసుపత్రి నుంచి తాత్కాలికంగా నర్సులను నియమించేందుకు అధికారులను ఆదేశించారు. అలాగే ఖాళీగా ఉన్న నర్సు పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అత్యుత్తమ వైద్యసేవలందించడంలో భద్రాద్రి వైద్యశాల ఆదర్శంగా నిలవాలని అన్ని విభాగాలు సమన్వయంతో ఆధునీకరణ దిశగా ముందుకు సాగాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ రవిబాబు, ఆసుపత్రి పర్యవేక్షకులు రామకృష్ణ, ఆర్‌ఎంవో రాజశేఖర్‌రెడ్డి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

17న పెన్షనర్ల మహాధర్నాను జయప్రదం చేయండి

ఎస్జీపీఏటీ రాష్ట్ర కార్యదర్శి ఏసుపాదం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్ల బకాయిల చెల్లింపుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ఉదాసీన వైఖరికి నిరసనగా ఈనెల 17న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్జీపీఏటీ) రాష్ట్ర కార్యదర్శి మేరీ ఏసుపాదం కోరారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సమావేశాన్ని మంగళవారం జిల్లా అధ్యక్షుడు పరిశ పుల్లయ్య అధ్యక్షతన కృషి భవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ 18 నెలలుగా పెన్షనర్లకు రావాల్సిన బకాయిలను చెల్లించడంలో ఈ ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం ఉద్యోగులకు రావాల్సిన డబ్బులను సైతం ప్రభుత్వం ఇవ్వలేకపోవడం అత్యంత దురదృష్టకరమన్నారు. పెన్షనర్ల బకాయిలతో పాటు పెన్షనర్లకు సంబంధించిన పలు సమస్యలు పెండింగులో ఉన్నాయని ఆమె తెలిపారు. హెల్త్ కార్డులు వస్తున్నాయని లీకులిస్తున్నారని, డీఏ, పీఆర్సీ గడువు తీరినా ఆచరణలోనికి రాకపోవటం శోచనీయం అన్నారు. ఈ సందర్భంగా 17న జరిగే మహాధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, ఉపాధ్యక్షుడు పెదమాళ్ల సత్యనారాయణ, శ్యాంసుందర్, కార్యదర్శులు బెల్లం రాధాకృష్ణమూర్తి, ఉడుగు సుధాకర్, తాడి అంజలి, దుగ్గినేని శ్రీనివాసరావు, నూతలపాటి నాగేశ్వరరావు, ఆదినారాయణ, జి. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల రవాణాపై సమాచారమివ్వండి

చైతన్యం - డ్రగ్స్‌పై యుద్ధం కార్యక్రమం

కొత్తగూడెం సబ్‌డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ

జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు



ర్యాలీలో పాల్గొన్న స్థానిక ప్రజలు, ప్రముఖులు

సుజాతనగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిషేధిత గంజాయి వంటి మత్తు పదార్థాలను రవాణా చేసే వ్యక్తుల సమాచారం అందించాలని భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లాలో ఈ నెల 15 వరకు జిల్లా పోలీసులు చేపట్టిన చైతన్యం - డ్రగ్స్‌పై యుద్ధం కార్యక్రమంలో భాగంగా మంగళవారం సుజాతనగర్ పోలీసుల ఆధ్వర్యంలో సుజాతనగర్ నుంచి లక్ష్మీదేవిపల్లి, ఇల్లెందు క్రాస్‌రోడ్ వరకు భారీ బైకు ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్పీ మాట్లాడుతూ చైతన్యం అనే కార్యక్రమం ద్వారా నిషేధిత గంజాయి వంటి మత్తు పదార్థాల బారినపడకుండా యువతకు అవగాహన కల్పించడం దీని యొక్క ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. గంజాయి అక్రమ రవాణాను అడ్డుకోవడం కోసం నిరంతరం తనిఖీలు చేపట్టడం జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను డ్రగ్ రహిత జిల్లాగా మార్చేందుకు పోలీసులు చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి ప్రజలు సహకరిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. గంజాయి అక్రమ రవాణా చేసే వారి సమాచారం అందించి బాధ్యత గల పౌరులుగా తమ కర్తవ్యాన్ని నిర్వర్తించాలని కోరారు. మత్తుకు బానిసలైన యువత తమ భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారని అన్నారు. ఎవరైనా నిషేధిత గంజాయిని అక్రమంగా రవాణా చేస్తూగానీ, విక్రయిస్తూగానీ పట్టుబడితే అట్టి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుని, అవసరమైతే పీడీ యాక్టులను కూడా నమోదు చేస్తామని తెలిపారు. అనంతరం ఎస్పీ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలో సుమారు 1000 మందికి పైగా స్థానికులు, ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, కొత్తగూడెం టూటౌన్ సీఐ ప్రతాప్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, 1టౌన్ సీఐ కరుణాకర్, లక్ష్మీదేవిపల్లి ఎస్సై రమణారెడ్డి, సుజాతనగర్ ఎస్సై రమాదేవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక లోపంతో నిలిచిన నవజీవన్ ఎక్స్‌ప్రెస్

బోనకల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బోనకల్ రైల్వే స్టేషన్ వద్ద గల సిగ్నలింగ్ వ్యవస్థలో తలెత్తిన సాంకేతిక లోపం వలన మంగళవారం సాయంత్రం నవజీవన్ ఎక్స్‌ప్రెస్ కొద్దిసేపు నిలిచి పోయింది. చెన్నై నుంచి హైదరాబాద్ వైపుకు వెళ్తున్న నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలు బోనకల్ రైల్వే స్టేషన్‌కు దగ్గరలో ఆగింది. బోనకల్‌లో హాల్టింగ్ లేకపోయినా రైలు ఆగడంతో ప్రయాణీకులు ఎం జరిగి ఉంటుందోనని ఆందోళన చెందారు. కొంతమంది బ్రేకులు ఫెయిలై ఆగిందని చర్చించినా చివరకు సిగ్నల్‌లో తలెత్తిన సాంకేతిక లోపమే కారణమని తెలిసింది. రైల్వే అధికారులు అప్రమత్తమై సిగ్నల్ వ్యవస్థను పునరుద్ధించడంతో యాధావిధిగా రైలు వెళ్లింది.

అసిస్టెంట్ ప్రొఫెసర్ సురేందర్‌రెడ్డికి డాక్టరేట్



మరిపెడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా మరిపెడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.సురేందర్‌రెడ్డి వృక్షశాస్త్రంలో కేయూ డాక్టరేట్ పొందారు. ఖమ్మం జిల్లాకు చెందిన ఈయన ఇన్ వివో అండ్ ఇన్ విట్రో స్టడీస్ ఆన్ సం ఎతినో మెడిసినల్ ప్లాంట్స్ ఆఫ్ భద్రాద్రి కొత్తగూడెం డిస్ట్రిక్ట్ ఆఫ్ తెలంగాణపై అనేక పరిశోధనలు చేసి మంగళవారం డాక్టరేట్ పట్టా అందుకున్నారు. సురేందర్‌రెడ్డిని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవన్‌కుమార్, సహచర ఆధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

మొక్కజొన్న కొనుగోళ్లకు సై

(5వ పేజీ తరువాయి)

దెబ్బతింది. కేంద్ర ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.2,400ఉండగా, బయట వ్యాపారులు రూ.1,700 నుంచి 2వేల వరకు కొనుగోలు చేస్తున్నారు. నాణ్యత లేదంటూ ప్రైవేటులో వ్యాపారులు ధర తగ్గిస్తున్నారు. దీంతో మార్క్‌ఫెడ్ రంగంలోకి దిగింది. సహకార సంఘాల ద్వారా మొక్కజొన్న పండే ప్రాంతాల్లో మొత్తం11 కేంద్రాలు ఏర్పాటు చేశారు. అందులో ఖమ్మం జిల్లాలో ఐదు కేంద్రాలను ముదిగొండ, గుదిమళ్ల, కారేపల్లి, మధిర, ఎర్రుపాలెంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇల్లెందు, గుండాల, టేకులపల్లి, కొత్తగూడెం, పినపాక, మణుగూరులో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు మార్క్‌ఫెడ్ డీఎం టి.సునిత ఁఆంధ్రజ్యోతిఁకి తెలిపారు. అయితే ఇంకా రైతుల నుంచి ఇప్పటి వరకు మొక్కజొన్న రాలేదని, 14శాతం కంటే తక్కువ తేమ శాతం ఉండాలని, ఎకరానికి 25క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, బ్యాంకు ఖాతా వివరాలు అందించి మొక్కజొన్న అమ్ముకోవచ్చని తెలిపారు. కాగా జిల్లాలో మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్టు తెలియక ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకే అమ్ముకుంటున్నారు. మొక్కజొన్నకు ప్రభుత్వ ధర అధికంగా ఉండగా.. ప్రైవేటులో ధర తక్కువగా ఉంది. క్వింటాకు రూ.500నుంచి రూ.700వరకు వ్యత్యాసం కనిపిస్తోంది. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, చేపలు, పశువుల దాణాకు, కోళ్ల పరిశ్రమల్లో మేతకు, బీరు తయారీలో ఈమొక్కజొన్నను అధికంగా వినియోగిస్తున్నారు. ఏపీ తదితర రాష్ట్రాలనుంచి కొందరు వ్యాపారులు జిల్లాలో గ్రామాల్లో తిరుగుతూ నేరుగా కొనుగోలు చేస్తున్నారు. అయితే ధర తక్కువగా కొనుగోలు చేయడంతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం మార్క్‌ఫెడ్ కేంద్రాలను ఏర్పాటుచేసింది. రైతులు ఈకేంద్రాల్లోనే మొక్కజొన్న అమ్ముకోవాలని మార్క్‌ఫెడ్ డీఎం సునిత తెలిపారు.

రెబ్బవరంలో బీసీ గురుకులాల జిల్లా క్రీడలు



మార్చ్‌పాస్ట్ నిర్వహిస్తున్న విద్యార్థినులు

వైరా, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెబ్బవరంలో ఉన్న ముసలిమడుగు మహాత్మాజ్యోతిబాపూలే తెలంగాణ బీసీ బాలికల గురుకుల విద్యాసంస్థల జిల్లా స్థాయి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఆ విద్యాసంస్థల ఉమ్మడి ఖమ్మంజిల్లా ఆర్‌సీవో చింతమళ్ల రాంబాబు, ఖమ్మంజిల్లా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల డీసీవోలు ఎం.సుష్మా, వి.బ్యూలా రాణి జ్యోతిప్రజ్వలన, ఒలంపిక్ టార్చ్‌ని వెలిగించి ర్యాలీని ప్రారంభించారు.

ఉమ్మడి జిల్లాలోని బీసీ గురుకులాల నుంచి 520మంది విద్యార్థినులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈనెల 13 వరకు పోటీలు జరుగనున్నాయి. ప్రిన్సిపాల్ కె.రాధిక, ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణ జీవన ఉపాధికి కృషి చేస్తున్న బీఆర్‌ఎల్‌ఎఫ్: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటల్

భద్రాచలం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భారత గ్రామీ ణ జీవనోపాధి ఫౌండేషన్ ద్వారా దేశంలో మహిళలు, గిరిజన వర్గాలపై దృష్టిసారిం చి ప్రజల జీవితాలను, జీవనోపాధిని మెరుగుపరిచేందు కు కృషి చేస్తుందని కలెక్టర్ జితేష్‌వి పాటిల్ అన్నారు. భద్రాచలంలోని ఐటీడీఏలో బీఆర్‌ఎల్‌ఎఫ్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. సంస్థ ఉద్యోగులతో మాట్లాడి వారి కార్యకలాపాలను అడిగి తెలుసుకున్నారు. ఉత్పాదక ఇన్‌పుట్‌లు, పీఎంఈజీపీ కింద కొన్ని మోడల్ కార్యకలాపాలను సిద్ధం చేస్తున్నామని, ఇది జిల్లాలో చిన్న రైతుల సమగ్ర అభివృద్ధిని అందిస్తుందని, ప్రజల జీవిత ఆదాయాలు, జీవనోపాధిని పెంచుతుందని పేర్కొన్నారు. ఈ సంస్థ కార్యకలాపాలు ని రాటంకంగా కొనసాగాలంటే ప్రత్యేకంగా కార్యాలయం ఏర్పాటు చేసుకోవాలని ఎన్‌ఆర్‌సీ పక్కన ఉన్న భవనంలోకి మార్చాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో రాహుల్, ఏవో సున్నం రాంబాబు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రి ఆర్‌ఎంవోగా విధుల్లో చేరిన కళావతీబాయి



ఉత్తర్వులను జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు అందిస్తున్న డాక్టర్ కళావతీబాయి

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆర్‌ఎంవోగా డాక్టర్ కళావతీబాయి మంగళవారం విధుల్లో చేరారు. ఇప్పటి వరకు ఆమె జిల్లా వైద్యాధికారి (డీఎంహెచ్‌వో)గా పనిచేశారు. అయితే ఆమె జిల్లా ఆస్పత్రిలో సీఎస్ ఆర్‌ఎంవోగా పని చేస్తూ ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వోగా ఏడాదిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల డిప్యూటీ సివిల్‌సర్జన్లకు సివిల్ సర్జన్లుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం పూర్తిస్థాయిలో డీఎంహెచ్‌వోలుగా బాధ్యతలు అప్పగించారు. ఖమ్మం జిల్లాకు డాక్టర్ డి.రామారావును డీఎంహెచ్‌వోగా నియమించింది. దీంతో ఇప్పటి వరకు ఇన్‌చార్జ్‌గా కొనసాగిన డాక్టర్ కళావతీబాయి తిరిగి తన మాతృస్థానం సీఎస్ ఆర్‌ఎంవోగా వెళ్లారు. మంగళవారం ఆమె జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎం.నరేందర్‌ను కలిసి ఉత్తర్వు లేఖను అందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 35 మంది గురుకుల విద్యార్థుల ఎంపిక

దమ్మపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ గురుకులాలు 11వ జోనల్ స్థాయి ఆటల పోటీలు మహబూబాబాద్ 6,7,8 జరగగా దమ్మపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నుంచి 35 మంది విద్యార్థులు వివిధ విభాగాలలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్స్‌పాల్ వెంకటేశ్వర్లు మంగళవారం ప్రకటనలో తెలిపారు. గురుకుల పాఠశాల నుంచి అథ్లెటిక్స్ వివిధ క్రీడా విభాగాలలో 85 మంది విద్యార్థులు పాల్గొన్నారు. హైజంప్, హ్యాండ్‌బాల్, బాల్ బ్యాట్‌మెంటన్, వాలీబాల్, చెస్ పోటీలలో ప్రథమ బహుమతులు సాధించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను, పీఈటీ గోపాల్‌ను, ఉపాధ్యాయులు అభినందించారు.

అథ్లెటిక్స్ పోటీలకు ముష్టికుంట్ల విద్యార్థి...

బోనకల్: రాష్ట్రస్థాయి అండర్-14 విభాగం లో అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని ముష్టికుంట్ల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న షేక్. నయిమ్ ఎంపికయ్యాడు. ఖమ్మంలో మం గళవారం జరిగిన అథ్లెటిక్స్ హై జంప్ విభాగంలో ప్రతిభను కనబరిచాడు. ఈ నెల 14న హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొను న్న విద్యార్థిని హెచ్‌ఎం భాగ్యలక్ష్మి, పీఈటీ నవీద్‌లు అభినందించారు. అదే విధంగా రావినూతల ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపికైనందుకు గానూ ఎంఈవో దామాల పుల్లయ్య అభినందించారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

అశ్వారావుపేటరూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పేకాట శిబిరంపై అశ్వారావుపేట పోలీసులు దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారిపై మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పరిధిలోని పాపిడిగూడెం సమీపంలోని పామాయిల్ తోటలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. వారి వద్ద నుంచి రూ.36,580 నగదు, మూడు ద్విచక్రవాహనాలు, ఆరుసెల్‌ఫోను స్వాధీనం చేసుకొన్నారు. వారిపై కేసు నమోదు చేసి నట్లు ఎస్‌ఐ యయాతిరాజు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి...

డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ఇద్దరు వ్యక్తులకు ఐదు రోజుల శిక్ష, మరొకరి ఆరురోజుల జైలు శిక్ష విధిస్తూ దమ్మపేట జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి భవాని మంగళవారం తీరు ఇచ్చినట్లు ఎస్‌ఐ యాయతిరాజు తెలిపారు. మరో 9మంది వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.1,000 జరిమానా విధించినట్లు తెలిపారు.

డీఎంఈ పరిధిలోకి వెల్‌నెస్ కేంద్రం

» కేంద్రాన్ని పరిశీలించిన జీజీహెచ్ సూపరింటెండెంట్ నరేందర్



మాట్లాడుతున్న నరేందర్

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి అనుసంధానంగా ఉన్న వెల్‌నెస్ కేంద్రం బుధవారం నుంచి డీఎంఈ (డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) పరిధిలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, జర్నలిస్టుల కోసం ఏర్పాటు చేసిన ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ వెల్‌నెస్ కేంద్రం ఇప్పటి వరకు ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కింద పని చేసింది. ఖమ్మంలో దీన్ని 2018 అక్టోబరులో దీన్ని ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం దీన్ని డీఎంఈ పరిధిలోకి తీసుకొచ్చింది. ఇక నుంచి వివిధ విభాగాల వైద్యులు, మందుల పంపిణీ మొత్తాన్ని డీఎంఈ చేసుకుంటుంది. ఇక్కడ పనిచేసే తాత్కాలిక ఉద్యోగులను మాత్రం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కింద పనిచేయాల్సి వస్తుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్, ఆరోగ్యశ్రీ మేనేజర్ పర్వతనేని శ్రీనివాసరావు తదితరులు పరిశీలించారు.

ప్రమాదకరంగా గ్రానైట్ రాళ్ల రవాణా



ముదిగొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం-కోదాడ ప్రధాన రహదారిపై ఒకే లారీ పై ఏడు గ్రానైట్ రాళ్ల లోడ్‌తో రవాణా జరుగుతూ ముదిగొండ ప్రధాన సెంటర్‌కు చేరుకునే సమయంలో ఆర్టీసీ బస్సు, ప్రజల రద్దీ సమయంలో ఆగ్రానైట్ రాళ్ల లోడ్‌ను చూసి ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఈ దృ శ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.

ఈ ఏడాది.. 4.69కోట్ల క్యూసెక్కులు

(5వ పేజీ తరువాయి)

దాటింది. అంతేకాదు 35 అడుగుల మేర వరద నీరు 37 రోజుల పాటు ఉండటం గమనార్హం. ఈ ఏడాది ఆగస్టు 21న వచ్చిన 51.9అడుగుల నీటిమట్టమే గరిష్ఠం కాగా జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో గోదావరి ప్రవాహం పలుమార్లు మొదటి, రెండో ప్రమాద హెచ్చరికలను దాటి ప్రవహించింది. ఇలా విడతలవారీగా గోదావరి రావడంతోనే గత రెండేళ్లతో పోలిస్తే ఈసారి దిగువకు ప్రవహించిన వరద నీరు 0.86 కోట్ల క్యూసెక్కులు అధికమంగా నమోదైందని అధికారులు చెబుతున్నారు.

ఉప్పొంగిన యువ తరంగం

జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో భారీగా పాల్గొన్న యువత

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): 29వ జాతీయ యువజనోత్సవాల సందర్భంగా జిల్లా యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవాలు ఉత్సాహంగా కొనసాగాయి. యువజనోత్సవాల్లో జిల్లా వ్యాప్తంగా సుమారు 500 మంది యువతీ, యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువత నృత్యాలతో, డ్యాన్సులతో, జానపద గేయాలతో ప్రేక్షకులను అలరించారు. యువజనోత్సవాలను డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి,స్టేడియం అసిస్టెంట్ మేనేజర్ ఉదయ్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం యువజనోత్సవాల్లో భాగంగా 15 నుంచి 29ఏళ్ల యువతకు జానపద నృత్యం(గ్రూపు), జానపద గేయం(గ్రూపు), వ్యాసరచన, పోస్టర్ తయారీ, వకృత్వ పోటీ, కవిత్వం, సైన్స్ మేళా తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారిని హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి యువజనోత్సవాలకు పంపనున్నట్లు డీవైఎస్‌వో తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపిన వారిని దేశ రాజధాని న్యూఢిల్లీలో జనవరి 12 నుంచి 16 వరకు జరిగే జాతీయస్థాయి యువజనోత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలు జాన్, మాలతీనాయుడు, రవికుమార్, కిరణ్‌కుమార్, మధు, శ్రీనివాస్, వీరన్న, యువజన, క్రీ డల శాఖ సిబ్బంది హరిబాబు, వెంకట్, గంగన్న తదితరులు పాల్గొన్నారు.


పెయింటింగ్ పోటీలో పాల్గొన్న యువత


నృత్యాలు చేస్తున్న యువత

విజేతలు వీరే..

జానపద నృత్య విభాగంలో :
గురుకుల జూనియర్ కళాశాల(వైరా) ప్రథమ బహుమతి సాధించగా, అనుష్క గ్రూప్ (అడవిమల్లెల గురుకుల కళాశాల) ద్వితీయ బహుమతి సాధించింది.

జానపద గేయం విభాగంలో..
మౌనిక గ్రూప్ (మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల కళాశాల రఘునాథపాలెం) ప్రథమ, స్నేహ గ్రూప్ (అడవిమల్లెల గురుకుల కళాశాల) ద్వితీయ బహుమతి సాధించింది.

స్టోరీ రైటింగ్ విభాగంలో :
ఓమ్‌శ్రీ (బ్రౌన్స్ ఫార్మసీ కళాశాల)ప్రథమ, కె. నక్షత్ర (డాక్టర్ బీఆర్. అంబేద్కర్ కళాశాల ఖమ్మం) ద్వితీయ బహుమతి సాధించింది.

పోస్టర్ తయారీ (పెయింటింగ్) విభాగంలో :
పి.మేఘన (ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఖమ్మం) ప్రథమ, అక్షయ(డాక్టర్ బీఆర్.అంబేద్కర్ కళాశాల ఖమ్మం) ద్వితీయ బహుమతి సాధించింది.

వకృత్వ పోటీ విభాగంలో :
లావణ్య(కవిత డిగ్రీ కళాశాల) ప్రథమ బహుమతి, అక్షయ(డాక్టర్ బీఆర్.అంబేద్కర్ కళాశాల ఖమ్మం) ద్వితీయ బహుమతి సాధించింది.

కవిత్వం పోటీ విభాగంలో :
క్రితికాశ్రీ (హార్వెస్ట్ కళాశాల) ప్రథమ, దీపిక(గురుకుల పాఠశాల వైరా) ద్వితీయ బహుమతి.

సైన్స్ మేళా విభాగంలో :
రమ్య (గురుకుల కళాశాల(వైరా) ప్రథమ బహుమతి సాధించగా, ప్రణయ్(ఏఎస్ఆర్ కళాశాల ఖమ్మం) ద్వితీయ బహుమతి సాధించారు.

పేర్లు కూడా రాయలేని స్థితిలో విద్యార్థులు?

పాఠశాలలు ఆకస్మిక తనిఖీ.. ఉపాధ్యాయులపై పీవో ఆగ్రహం

అశ్వారావుపేట రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గిరిజన చిన్నారుల విద్యను బలోపేతం చేసేందుకు అనేక సంస్కరణలు చేపట్టటం జరిగిందని, అయినా కనీసం చిన్నారులు తెలుగు, ఇంగ్లీషులో తమపేర్లు రాసుకోలేని పరిస్థితి ఉందని, ఉపాధ్యాయులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐటీడీఏ పీవో రాహుల్ సూచించారు. మండలంలోని పాకలగూడెం, బండారుగుంపు గిరిజన ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఐటీడీఏ పీవో ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పీవో విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. పలు రకాల రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో గిరిజన చిన్నారుల చేత బోర్డుపై అక్షరమాల, అధికారుల పేర్లను రాయించారు. పిల్లలు సక్రమంగా రాయకపోవటం, చదవకపోవటం గ్రహించి బోధనతీరు ఇలాగేనా అని ప్రశ్నించారు. పిల్లలు తమపేర్లను కూడా సక్రమంగా రాసుకోకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. ఉద్దీపకం వర్క్‌బుక్స్‌ను పరిశీలించి విద్యార్థుల చేత చదివించారు. పిల్లలు పూర్తిస్థాయిలో పదాలు చెప్పటం లేదని ఉపాధ్యాయులు పిల్లలు తప్పులు లేకుండా రాసేలా చూడాలన్నారు. ఎస్‌సీఆర్‌పీ పర్యవేక్షణ సక్రమంగా ఉండాలని, పాఠశాలలో చిన్నారులకు ఉపాధ్యాయులు ఎలా బోధిస్తున్నది పరిశీలించాలని తెలిపారు. ఉద్దీపకం వర్క్‌బుక్స్-2 ద్వారా తప్పనిసరిగా విద్యార్థులకు చదవటం, రాయటం వచ్చేలా చూడాలన్నారు. ఐటీడీఏ ద్వారా అందించిన ఉద్దీపకం వర్క్‌బుక్స్ నిర్వహణ పట్ల ఉపాధ్యాయులు శ్రద్ధచూపటం లేదని, వర్క్‌బుక్స్‌ను సరిగా చేయించక పోవటం ద్వారా పిల్లలు సరిగా చదవటం, రాయటంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఇంగ్లీషు, గణితంకు సంబంధించిన ఉద్దీపకం పుస్తకాలను పిల్లల చేత రాయించాలని అన్నారు. పీవో వెంట అధికారులు, ఉపాధ్యాయులు ఉన్నారు.


విద్యార్థితో చదివిస్తున్న పీవో రాహుల్

పైరవీ చేసిన వారికి బెనిఫిట్స్..

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని
కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా
భద్రాద్రి కలెక్టర్‌కు వినతి ప్రతం అందజేసిన రిటైర్డ్ ఉద్యోగులు



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన రిటైర్డ్ ఉద్యోగులు

కొత్తగూడెం కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది నుంచి అపరిష్కృతంగా ఉన్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డి మాండ్ చేస్తూ మంగళవారం తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.వెంకటేశ్వరరావు, ఏ.ముత్యం మాట్లాడుతూ 2024 మార్చి తర్వాత పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులకు ఎలాంటి బెనిఫిట్స్ రాకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 తర్వాత పదవి విరమణ చేసిన కొందరు ఉద్యోగులకు అక్రమ మార్గంలో బెనిఫిట్స్ అందజేశారని, పైరవీలు చేసిన వారికి చెల్లిస్తున్నారని, దీనివల్ల పదవీ విరమణ చేసిన ఉద్యోగుల మధ్య భేదాభిప్రాయం సృష్టించి ఉద్యమాన్ని నీరుగార్చే వి ధంగా ప్రయత్నం చేస్తున్నారని వారు విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం గతంలో నెలకు రూ. 700కోట్లు చెల్లిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇం తవరకు కార్యరూపం దాచలేదని, ఇచ్చిన ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేక పోయిందని వా రు ఆందోళన వ్యక్తం చేశారు. తాము దాచిపెట్టుకున్న సొమ్మును కూడా చెల్లించడానికి ప్రభుత్వం అయిష్టత చూపుతున్నదన్నారు. నగదు రహిత వైద్య సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చినప్పటికీ అది కూడా ప్రభుత్వం చేయలేకపోతుందని అన్నారు. అనంతరం తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాల్సిందిగా భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ దీక్ష కార్యక్రమంలో ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్, భద్రాచలం డివిజన్ నాయకులు వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ జిల్లా రిటైర్డ్ ఉద్యోగులు శ్రీనివాస్, రవికుమార్, ప్రసాద్, సురేష్, మహిళ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బూర్గంపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా గోదావరి నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారంతో మంగళవారం బూర్గంపాడు పోలీసులు దాడులు నిర్వహించారు. సారపాకలో చేపట్టిన దాడుల్లో ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధ్యులైన ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ ప్రసాద్ హెచ్చరించారు.

వైరాలో ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం

వైరా, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వైరాలోని క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ ప్రధాన రహదారిపై మణుగూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సుకు పెనుప్రమాదం తప్పిపోయింది. వైరా బస్టాండ్ నుంచి మణుగూర్ వెళ్తున్న టీఎస్ 28 టీబీ 3677నెంబర్ గల బస్సు తల్లాడ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న టాటా ఏస్ వాహనం క్రాస్‌రోడ్డు వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బస్సులోని ప్రయాణీకులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బస్సులోని ప్రయాణీకులను డ్రైవర్, కండక్టర్‌లు కిందకు దించి వేరే బస్సులో గమ్యస్థానాలకు పంపించారు. వైరా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


వైరాలోని క్రాస్‌రోడ్డు వద్ద ప్రమాదానికి గురైన ఆర్టీసీ

రామయ్యకు ఘనంగా పట్టాభిషేకం

స్వామి వారిని దర్శించుకున్న భద్రాద్రి కలెక్టర్
దేవస్థానం గోశాలలో పశువైద్య శిబిరం

భద్రాచలం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామికి మంగళవారం పట్టాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి నెల పుష్యమి నక్షత్రం రోజున స్వామివారికి పట్టాభిషేకం నిర్వహించడం అనాధిగా వస్తున్న సంప్రదాయం. అందులో భాగంగా తొలుత స్వామి వారికి నిత్య కల్యాణం నిర్వహించిన అనంతరం పట్టాభిషేక కార్యక్రమం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, కలశావాహన, శ్రీమద్రామాయణంలో పట్టాభిషేక ఘట్టం ప్రవచనంను దేవస్థానం రామాయణ పారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు చేశారు. తరువాత కిరీటధారణ, ప్రోక్షణ, ప్రత్యేక ప్రసాద నివేదన చేసి భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

స్వామి వారిని దర్శించుకున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్
శ్రీ సీతారామచంద్రస్వామి వారిని మంగళవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ దర్శించుకున్నారు. ఈ సమయంలో ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌కు లక్ష్మీతాయారు ఆలయంలో వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలను దేవస్థానం ఈవో ఎల్. దామోదర్‌రావు అందజేశారు.


రామాలయంలో కలెక్టర్‌కు తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న ఈవో దామోదర్‌రావు

దేవస్థానం గోశాలలో పశువైద్య శిబిరం
భద్రాచలం దేవస్థానంకు చెందిన పురుషోత్తపట్నం గ్రామంలో ఉన్న గోశాలలో మంగళవారం బైఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యులు డాక్టర్ బాలకృష్ణ గోశాలలో ఎదకు రాని, చూడి నిలువని 30 ఆవులకు పరీక్షలు చేసి చికిత్స అందించారు. అలాగే 20 లేగదూడలకు నట్టల మందు తాగించారు. అలాగే జిల్లా పశువైద్య, పశు సంవర్ధక అధికారి డా.వెంకటేశ్వర్లు గోశాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఠాగూర్ ప్రసాద్, గోశాల నిర్వహణాధికారి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

స్కూల్ బస్సు కిందపడి చిన్నారి మృతి

ఆడుకుంటూ వెళ్లి
వెనుకచక్రాల కింద పడిన దీక్షిత్
భద్రాద్రి జిల్లా కరిసలబోడుతండాలో విషాదం
తమ్ముడి మృతితో వీడిన కవలల బంధం

చండ్రుగొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ బస్సు కిందపడి రెండేళ్ల వయసున్న చిన్నారి మృతిచెందిన సంఘటన మంగళవారం ఉదయం భద్రాద్రికొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలం కరిసలబోడు తండాలో జరిగింది. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలివీ.. జూలూరుపాడులోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు విద్యార్థులను పాఠశాలకు తీసుకుపోయేందుకు రోజూలాగే కరిసలబోడు తండాకు వచ్చింది. గ్రామంలోని పలువురు విద్యార్థులను బస్సు ఎక్కించుకుంటున్న సమయంలో అదే గ్రామానికి చెందిన భూక్యా గోపి, అఖిల దంపతుల దీక్షిత్‌నాయక్ (2) ఆడుకుంటూ బస్సు వెనుక టైర్ల వద్దకు వెళ్లాడు. ఇది గమనించని డ్రైవర్ బస్సుని ముందుకు పసివాడైన దీక్షిత్ చక్రాల కిందపడ్డాడు. దీంతో అక్కడ ఉన్న వారు కేకలు వేయటంతో బస్సును ఆపగా.. అప్పటికే చిన్నారి చక్రాల కింద నలిగిపోయాడు. దీంతో ఆగ్రహించిన గ్రామస్థులు బస్సు డ్రైవర్ వంశీకృష్ణపై దాడికి దిగారు. ఈ సమయంలో కొందరు దాడిని నిలువరించగా.. డ్రైవర్ అక్కడినుంచి పరారయ్యాడు. భూక్యా గోపి, అఖిల దంపతులకు కవలపిల్లలు కాగా.. వారిలో కూతురు ద్రాక్షశ్రీ కాగా దీక్షిత్‌నాయక్ కుమారుడు. చిన్నావాడైన దీక్షిత్ మృతితో కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. కాగా రోజూ తనతో కలిసి ఆడుకునే తమ్ముడు నిర్జీవమై ఉండటం, తల్లిదండ్రులు రోదిస్తుండటంతో విలపిస్తుండటంతో ద్రాక్షశ్రీ బిక్కముఖంతో దిక్కులు చూస్తుండటాన్ని చూసి గ్రామస్థుల కళ్లు చెమర్చాయి. చండ్రుగొండ ఎస్ఐ శివరామకృష్ణ ప్రమాద స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

టీజీవో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా నరేందర్

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీవో) జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ 2గా గంగవరపు నరేందర్‌ను ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షులుగా జి.రమేష్‌బాబు ఎన్నికైనట్టు టీజీవో అధికారులు తెలిపారు. జిల్లా కార్యవర్గ సమావేశం టీజీవో భవన్‌లో మంగళవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొంగర వెంకటేశ్వరరావు, మోదుగు వేలాద్రి అధ్యక్షత నిర్వహించిన ఈ సమావేశంలో వారు మాట్లాడుతరూ ప్రభుత్వం నుంచి ఉద్యోగులకు రావలసిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయి పడ్డ డీఏలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీని వెంటనే అమలు చేయాలని కోరారు. ఉద్యోగులు దాచుకున్న జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐ, సరెండర్ లీవ్, బకాయిలను, రిటైర్మెంట్ బెనిఫిట్లను వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగుల హెల్త్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. అనంతరం జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ 2గా గంగవరపు నరేందర్, ఉపాధ్యక్షులుగా జి. రమేష్ బాబును ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యవర్గంలో ఖమ్మం జిల్లా నుంచి ఎన్నికైన కొండపల్లి శేషప్రసాద్‌ని జిల్లా కార్యవర్గం ఘనంగా సన్మానించింది. ప్రజాకవి అందెశ్రీ అకాల మరణానికి జిల్లా కార్యవర్గం ఘననివాళులు అర్పించారు.సమావేశంలో అసోసియేట్ అధ్యక్షుడు మల్లెల రవీంద్రప్రసాద్, ట్రెజరర్ సూరంపల్లి రాంబాబు, హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ పి.విజయ్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, సతీష్, హరీష్, పుష్పరాజ్, సింహాచలం, డాక్టర్ బి.బాబురత్నాకర్, భాస్కర్‌రావు, టి.శ్రీనివాస్, బి.నాగేశ్వరరావు, ఎం. వెంకటేశ్వర్లు, మల్లయ్య, తాజుద్దీన్ పాల్గొన్నారు.

సామినేని హంతకులను అరెస్టు చేయాలి

డీజీపీకి సీపీఐఎం రాష్ట్ర నాయకుల వినతి


డీజీపీకి వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఎం రాష్ట్ర నాయకులు

ఖమ్మం అర్బన్/చింతకాని, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సీపీఎం రాష్ట్ర నాయకుడు సామినేని రామారావు హత్య నిందితులను వెంటనే అరెస్టుచేయాలని సీపీఎం రాష్ట్ర నాయకులు డీజీపీ బి.శివధర్‌రెడ్డికి విన్నవించారు. ఈ మేరకు మంగళవారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటిరంగారెడ్డి, పోతినేని సుదర్శన్‌రవు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాదినేని రమేష్, మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెరసకాయల జంగారెడ్డి, తదితరులు హైదరాబాద్‌లో డీజీపీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హత్య జరిగి 12 రోజులవుతున్నా నిందితులను అరెస్టు చేయటంలో పోలీస్ శాఖ నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. హంతకులను స్వయంగా చూశానని రామారావు భార్య పేర్లతో సహా ఫిర్యాదు చేసినా నిందితులను అరెస్టు చేయక పోవటాన్ని వారు తప్పుపట్టారు. రామారావు ఉంటే తమకు రాజకీయంగా మనుగడ సాగదని భావించిన కాంగ్రెస్ నాయకులు కుట్రతో హత్యచేశారని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి రామారావు హత్య నిందితులను అరెస్టు చేయాలని కోరారు.

పత్తి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

చలి నేపథ్యంలో తేమ శాతం విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి
సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల ఆకస్మిక తనిఖీలో కలెక్టర్ అనుదీప్


జీఆర్ఆర్ జిన్నింగ్ మిల్లులో పత్తిని పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మం రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మద్దతు ధరకు పత్తిని అమ్ముకునేలా చర్యలు తీసుకున్నామని, రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పేర్కొన్నారు. ఖమ్మం రూరల్ మండలంలోని పొన్నేకల్లు, గుర్రాలపాడు గ్రామాల పరిధిలో సీసీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పత్తి కొనుగోలు కేంద్రాలను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా పత్తి కొనుగోలు ప్రక్రియ, ట్యాబ్ఎంట్రీ, గేట్ ఎంట్రీ పాస్, పంట నమోదులను పరిశీలించారు. రైతులు తీసుకొచ్చిన పత్తి పంటను తేమ యంత్రంతో పరిశీలిస్తున్న తేమశాతాన్ని గమనించారు. రైతులతో మాట్లాడి సమస్యలను కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ క్రమంలో పలువురు రైతులు కలెక్టర్‌తో మాట్లాడుతూ చలి నేపథ్యంలో తేమశాతంలో కొంతమేర వెసులుబాటు ఇవ్వాలని, అకాల వర్షాల వల్ల కొంత పత్తి పంట దెబ్బతిన్నందున గిట్టుబాటు ధర కల్పించాలని, సెంటర్ లో కొనుగోలు సాయంత్రం సమయం పెంచాలని తెచ్చుకున్న పంటను ఆదేరోజు కొనుగోలు చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు. స్పందించిన కలెక్టర్ అధికారులను కొనుగోలులో రైతులకు అన్యాయం జరగకుండా అధికారులు బాధ్యతగా వ్యవహరించి, ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పత్తి పంట తీసుకు వచ్చిన రైతులకు కనీస మద్దతు ధరను చెల్లిస్తున్నామని, అలాగే రైతులు తేమశాతం 12 ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఈ నెలలో అధికంగా పత్తి పంట కొనుగోళ్లు జరగనున్నాయని, దీనికి అనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలన్నారు. కపాస్ కిసాన్ యాప్‌లో రైతులు స్లాట్ బుకింగ్ చేసుకునే విధంగా హెల్ప్ సెల్స్ డెస్క్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కౌలురైతులు కపాస్ కిసాన్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడం కోసం వ్యవసాయ విస్తరణ అధికారులు అందుబాటులో ఉంటారని, వివరాల నమోదు ద్వారా కౌలు రైతులు పత్తి అమ్ముకోవడంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటాయని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రాంప్రసాద్, అధికారులు వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవాన్ని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ రాపర్తినగర్ ఖమ్మం బాలికల-1 కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం-వరంగల్-నల్గొండ టీచర్స్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ఖమ్మంజిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంప్ ఆఫీస్ ఇంచార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, జీఐహెచ్ సంస్థ ప్రతినిధి జైనుల్ పాషా ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల విజయాలలో కళాశాల అధ్యాపకులు, ప్రిన్సిపాల్ అఖిల కృషి విశేషమన్నారు. తాజాగా కళాశాల నీట్, ఐఐటి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఎంపిక కావడం గర్వకారణమన్నారు. గురుకుల విద్యా వ్యవస్థలో మార్పులకు తప్పక కృషిచేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు నిత్యం తమ లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. మంత్రి పొంగులేటి సహకారంతో ఐఐటీ నీట్ విద్యార్థుల కోసం కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయిస్తాం అని హామీఇచ్చారు. ఈ సందర్భంలో కళాశాల నుంచి ఈ సంవత్సరం ఎంబీబీఎస్, నీట్ సీట్లను సాధించిన పూర్వ విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎల్‌సీ అరుణకుమారి, విజిలెన్స్ బృందం, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

విచారణ ఏమైంది..?

న్యాయం చేయండి అంటూ ఈఎస్‌ను ఆశ్రయించిన కొత్తగూడెం ఎక్సైజ్ కానిస్టేబుల్
వారం రోజులు గడుస్తున్నా కొలిక్కిరాని పంచాయితీ

చుంచుపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం ఎక్సైజ్‌కార్యాలయంలో సీఐ జయశ్రీ వేధింపులు తాళలేక మహిళా కానిస్టేబుల్ అఖిల ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటనలో తమకు న్యాయం చేయాలంటూ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఈఎస్) కె.జానయ్యను కానిస్టేబుల్ బృందం కలిసి వారం రోజులు గడిచినా కొలిక్కిరాలేదు. ఈ ఘటనపై స్పందించి ఈ నెల 5న ఈఎస్‌ను తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ కానిస్టేబుల్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజిరెడ్డి, ఉమ్మడి ఖమ్మంజిల్లా అధ్యక్షుడు కరీం కలిసి సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని వేడుకున్నారు.భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరుగకుండా చూడాలని ఈసందర్భంగా వినతి పత్రం అందించి బాధితులకు అండగా నిలిచారు. ఈ ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని, తప్పు చేసిన వారు ఎంతటి వారైనా చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఈఎస్ హామీ ఇచ్చారని తెలుస్తోంది. అదేవిధంగా కిందిస్థాయి ఉద్యోగులకు ఎలాంటి సమస్యలు ఉన్న ఉన్నత అధికారులకు తెలియపరచాలని సూచించారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని క్షణికావేశంతో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని సిబ్బందికి గతంలో సూచనలు చేసినట్లు సమాచారం.

రోజులు గడుస్తున్నా కొలిక్కిరాని పంచాయతీ..
భద్రాద్రి జిల్లా ఈఎస్ జానయ్యకు బాధిత ఎక్సైజ్‌కానిస్టేబుల్ బృందం న్యాయం చేయాలని ఫిర్యాదు చేసి రోజులు గడుస్తున్నా నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలువినిపిస్తున్నాయి. మంగళవారం వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐ జయశ్రీ కార్యాలయానికి వచ్చారని.. తమకు న్యాయం జరిగేవరకు విధులకు హాజరు కాబోమని కానిస్టేబుల్ బృందం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సీఐ వేధింపులపై విచారణచేసి ఎలాంటి చర్యలు తీసుకున్నారని అడిగేందుకు మరోసారి కానిస్టేబుల్ బృందం బాబు క్యాంపులోని ఈఎస్ కార్యాలయాన్ని ఆశ్రయించారు. ఈ విచారణ నివేదికపై ఈఎస్ జానయ్యను ఆంధ్రజ్యోతి వివరణ అడిగేందుకు ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.



నాణ్యత లేని ఆహారపు వస్తువుల తయారీ

ఖమ్మంలో విస్తృతంగా ఆహారపు తనిఖీ
టిఫిన్ సెంటర్లు, పాల కేంద్రాలు, హోంపుడ్స్‌లో బయటపడ్డ లోపాలు
పలు సెంటర్ల నిర్వాహకులకు నోటీసులు జారీ చేసిన అధికారులు

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అధికారుల ఆదేశాలతో ఎట్టకేలకు జిల్లా ఆహారపు నాణ్యతా ప్రమాణాలశాఖ అధికారులు మంగళవారం ఉదయం కాలు బయటపెట్టారు. గత కొంత కాలంగా ఖమ్మం నగరంలో టిఫిన్ సెంటర్లు, హోంపుడ్స్‌పై అనేక విమర్శలు రావటంతో ఆ మేరకు తనిఖీలు చేపట్టాలని రాష్ట్రస్థాయి అధికారులు ఆదేశించారు. దీంతో మంగళవారం ఉమ్మడి జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఖమ్మంలో విస్తృతంగా తనిఖీలు చేశారు. బైపాస్ రోడ్డులోని 7 టిఫిన్ సెంటర్లు, అలాగే నగరంలోని 2 పాల ఉత్పత్తుల కేంద్రాలు, ఒక హోంఫుడ్స్ లను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా అధికారులు నెవ్వరపోయే విధంగా లోపాలు బయటపడ్డాయి. కనీసం లైసెన్స్‌లు లేకుండా టిఫిన్ సెంటర్లు, హోం ఫుడ్స్ నిర్వహిస్తున్నారు. వంటశాలలు వంటచేసే పాత్రలతో సహా అపరిశుభ్రంగా ఉండటాన్ని గుర్తించారు. దుమ్ము, మడ్డి, మసితో వంటశాలలు నిండిపోయాయి. దీంతో నిర్వాహణ మార్చుకోవాలని 4 టిఫిన్ సెంటర్లకు నోటీసులు జారీ చేశారు. వరంగల్ క్రాస్ రోడ్డులోని చౌదరి హోటల్, మారాజ్ మిల్క్ సెంటర్, హోటల్ సాంప్రదాయ నిర్వాహకులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. బోర్డులు కూడా లేని మరో ఇద్దరు వ్యాపారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నాణ్యత సరిగా లేని 5 కేజీల అల్లాన్ని ధ్వంసం చేశారు. రెండు శ్యాంపిల్స్ సేకరించారు.

దివ్యాంగుల సాధికారిత రాష్ట్ర పురస్కారాల కోసం దరఖాస్తుల స్వీకరణ

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సాధికారిత రాష్ట్ర పురస్కారాలు ప్రదానం కొరకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా శిశు, దివ్యాంగుల సంక్షేమశాఖ అధికారి రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం డిసెంబరు3న జరపనున్న నేపథ్యంలోఈ నిర్ణయం తీసుకున్నారు. అరు లైన వ్యక్తులు లేదా సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు ఫారం, మార్గదర్శకాల కొరకు ఆన్‌లైన్ వెబ్ సైట్‌వివరాలు ఉన్నాయని తెలిపారు. దరఖాస్తులను ఈనెల 20లోపు అందించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు

నాణ్యమైన విద్యను అందిద్దాం

» జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైని
» ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాల తనిఖీ

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ అభ్యసన ఫలితాల సాధనే ధ్యేయంగా పని చేసి జిల్లాను అగ్రస్థానంలో నిలుపుదామని జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైని అన్నారు. ఇటీవల పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు, వేసవికాలంలో జరిగిన శిక్షణకు హాజరుకాని ఉపాధ్యాయులకు రెండు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం రెండు కేంద్రాల్లో మంగళవారం ప్రారంభించారు. జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) శిక్షణ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు అభ్యసన ఫలితాలను సాధించడంలో మన జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని అన్నారు. ఉన్నత పాఠశాలలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో, అభ్యసన ఫలితాలను సాధించడంలో ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి పెనర ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, పదోన్నతి పొంది ఉన్నత పాఠశాలలకు వచ్చిన తర్వాత 6 నుంచి 10వ తరగతి పాఠ్యపుస్తకాలు, పాఠ్యపుస్తకాల నేపథ్యంపై అవగాహన పొందుతూ ఎలా బోధన చేయాలో రిసోర్స్ పర్సన్లు తగిన రీతిలో మెళకువలు వివరిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి రామకృష్ణ ,ఉమ్మడి ఖమ్మం జిల్లా కు చెందిన ఉపాధ్యాయ శిక్షణార్థులు, రిసోర్స్‌పర్సన్లు, డైట్‌కాలేజీ సెంటర్ ఇన్చార్జి శ్రీనివాసరావు, శాంతినగర్ స్కూల్ సెంటర్ ఇన్చార్జ్ శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఈవో చైతన్య జైని

నూతన డీఈవోకు పలువురి శుభాకాంక్షలు

జిల్లా విద్యాశాఖ అధికారిగా మంగళవారం బాధ్యతలు చేపట్టిన చైతన్య జైనీ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ శ్రీజను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈక్రమంలోనే డీఈవోను విద్యాశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ చావా శ్రీనివాసరావు, ఏఎంవో ప్రభాకర్‌రెడ్డి, సీఎంవో రవికుమార్, ఇతర సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కరీంనగర్ జిల్లా విద్యాశాఖ అధికారిగా ఉంటూ సెలవులో ఉన్న జైనీని ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారిగా నియమితులైన విషయం తెలిసిందే.

మెడికల్ కళాశాలలో పాథాలజీ డే

ఖమ్మంకలెక్టరేట్,నవంబరు11(ఆంధ్రజ్యోతి): పాథాలజీడేను పురస్కరించుకుని మంగళవారం మెడికల్ కళాశాలలో విద్యార్థులకు ప్రత్యేక పోటీలను నిర్వహించారు. మెడికల్ కళాశాల రెండు, మూడో విద్యాసంవత్సరం చదువుతున్న విద్యార్థులకు క్విజ్‌పోటీలను నిర్వహించారు. ఆ తరువాత పోస్టర్ పెయింటింగ్ రంగోలీ ప్రజెంటేషన్ నిర్వహించారు. విద్యార్థులు బృందాలుగా ఏర్పడి వారు రంగురంగులతో వివిధ ఆకృతులను అందంగా సిద్ధం చేశారు. వీటిని కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ సరిత, డాక్టర్ సృజన, హెచ్‌వోడీలు ఫార్మకాలజీ సుగుణ, మైక్రోబయాలజీ డాక్టర్ రమాదేవి, డాక్టర్ వేణు, డాక్టర్ సందీప్ వీటిని పరిశీలించారు. బుధవారం కళాశాలలో విభాగంలో సెమినార్ నిర్వహించనున్నారు. విజేతలకు బహుమతులను అందచేయనున్నారు.


పోటీలను పరిశీలిస్తున్న అధికారులు

మెడికల్ కళాశాలకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి

» రూ.2.17 కోట్లతో నిర్మాణం
» నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించిన అధికారులు

ఖమ్మంకలెక్టరేట్,నవంబరు11(ఆంధ్రజ్యోతి): ఖమ్మం మెడికల్ కళాశాల నుంచి ప్రభుత్వ ఆస్పత్రిని అనుసంధానం చేసేందు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరి చేసింది. ఈమేరకు టీఎస్‌ఎంఐడీసీ నుంచి రూ.2.17 కోట్లు మంజూరి అయ్యాయి. పనుల కేటాయింపుకూడా చేశారు. ప్రస్తుతం మెడికల్ కళాశాల (పాతకలెక్టరేట్) నుంచి ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లేందుకు వైరారోడ్డుకు అడ్డంగా దీన్ని నిర్మించనున్నారు. మెడికల్ కళాశాలలోని పాతబావి ప్రాంతం నుంచి జిల్లా ఆస్పత్రిలో ట్రామాకేర్ ద్వారా పక్కగా దీన్ని నిర్మించనున్నారు. వంతెన నిర్మాణం కోసం మెడికల్ కళాశాల, ఆస్పత్రి ట్రామాకేర్ ద్వారం ఎదురుగా విద్యుత్ హైటెన్షన్ వైర్లున్నాయి. వీటిని తొలగిస్తే కానీ ఈ పనులను ప్రారంభించలేరు.దీనికోసం బుధవారం ట్రాన్స్‌కో అధికారులు, మెడికల్ కళాశాల అధికారులు, కాంట్రాక్టరు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. వీటిని తొలగించిన తర్వాత పనులను ప్రారంభించనున్నట్లు తెలిసింది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. ఈ వంతెన పూర్తయితే మెడికల్ విద్యార్థులకు ఆస్పత్రికి వెళ్లేందుకు మార్గం సులువవుతుంది.

ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

ఖమ్మంకార్పొరేషన్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): దేశ తొలికేంద్ర విద్యాశాఖ మంత్రి మౌలాన అబుల్ కలాం ఆజాద్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేఎంసీ కార్యాలయంలో ఆజాద్ 137వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నగర పాలక సంస్థ మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ ఆజాద్ విద్యావిధానపరమైన నిర్ణయాలతో ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా భారతీయ విద్యార్థులు ఉద్యోగ,ఉపాధిపొందుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యా, వైద్య, సంక్షేమ రంగాలకు అధిక ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ పాతిమాజోహరా, కార్పొరేటర్లు బీజే క్లైమెట్, రాపర్తి శరత్‌కుమార్, కన్నం వైష్ణవి, పట్టణ ప్రణాళిక అధికారి గంధం వసుంధర, ఉద్యాన అధికారి బెల్లం రాధిక, మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, ఉద్యోగులు పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో..

జిల్లాకాంగ్రెస్ కార్యాలయంలో ఆజాద్ జయంతి వేడుకలను నిర్వహించారు. జిల్లా, నగర అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎండీ జావీద్‌లు మౌలాన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రిగా మౌలాన తీసుకున్న సంస్కరణలను గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, పోట్ల నాగేశ్వరరావు, కార్పొరేటర్ రాపర్తి శరత్‌కుమార్, కన్నం వైష్ణవి, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు దొబ్బల సౌజన్య, మెక్కా శేఖర్‌గౌడ్, హస్సెన్, పుచ్చకాయల వీరభద్రం, కొంటెముక్కల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



కేఎంసీలో నివాళులు అర్పిస్తున్న మేయర్ నీరజ, జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా,నగర అధ్యక్షులు

విద్యతోనే పేదరికానికి విముక్తి

(5వ పేజీ తరువాయి)

అరబిక్, బెంగాలీ, ఇంగ్లీష్ భాషలలో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ పండితుడని, 11 సంవత్సరాల పాటు విద్యాశాఖ మంత్రిగా పని చేశారన్నారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలు చదువుకోవాలని ఆశయంతో కులమత బేధాలు లేకుండా పని చేశారన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలను గుర్తించిన ప్రభుత్వం 1992లో భారతరత్న అవార్డు అందజేసి గౌరవించిందని కలెక్టర్ అన్నారు. విద్యతో మాత్రమే పేదరికం దూరమవుతుందని భావించి ప్రతీ పేదవాడికి విద్య అందే దిశగా చర్యలు తీసుకున్నారన్నారు. వ్యక్తిగతంగా మతపరమైన సంప్రదాయాలు పాటిస్తూ మనమంతా భారతదేశంలో భాగమని తెలిపారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మైనారిటీ విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టి గురుకులాలను ఏర్పాటు చేసింది, మైనారిటీ బాలికల విద్యపై దృష్టి సారించి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.కళావతి బాయి, జిల్లా మైనార్టీ శాఖ అధికారి ముజాహిద్, కలెక్టరేట్ ఏవో కారుమంచి శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పొంతనలేని విధులతో పంచాయితీ

» మెప్మాలో అంతర్గత కలహాలు
» క్రమసంఖ్య ఆధారంగా వీవోలకు విధులు
» కొత్త మహిళా సంఘాలు నిర్మాణంలో వెనకడుగు
» రూట్‌మ్యాప్ ఆధారంగా కేటాయిస్తే పరిష్కారం



ఖమ్మంకార్పొరేషన్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతంలోని పేదరిక నిర్మూలనకు పాటు పడాల్సిన పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) పొంతన లేని విధంగా ప్రాంతాలను కేటాయించి చివరకు అంతర్గత పంచాయతీల వరకు దారి తీసింది. ఏకంగా సీవో సస్పెన్షన్ వరకు వెళ్లింది. ఒక వైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారితకు అనేక పథకాలను అమలు చేస్తున్నాయి. ఆ మేరకు పురోగతిలో వెళ్లాల్సిన సమయంలో మెప్మా తడబడుతోంది.

క్రమ సంఖ్య తో డివిజన్లు కేటాయింపు

17వ డివిజన్ పరిధిలో శ్రీనివాసనగర్, బెస్త కాలనీ, టీచర్స్ కాలనీ, కాల్వకట్ట ప్రాంతాలు ఉంటాయి. ఆ పక్కనే 27వ డివిజన్ అయ్యప్ప స్వామి టెంపుల్, ప్రకాశ్‌నగర్, టీచర్స్ కాలనీ పాత శ్రీనివాసనగర్, అంబేద్కర్ సెంటర్ ప్రాంతాలు ఉంటాయి. ఆ ప్రాంతాలు ఆదారంగా ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న వార్డుఆఫీసర్లు, బిల్‌కలెక్టర్లు, వర్క్ ఇన్స్‌పెక్టర్లు, పారిశుధ్య సిబ్బంది వరకు విధులు కేటాయిస్తారు. కానీ మెప్మా వరకు వచ్చే వరకు మాత్రం ప్రాంతాలతో సంబంధం లేకుండా వార్డుల క్రమసంఖ్యల మేరకు కమ్యూనిటీ ఆర్గనైజర్లుకు డివిజన్లు కేటాయించారు. 1వ డివిజన్ నుంచి 14వరకు ఒకరికి, 15వ డివిజన్ నుంచి 30వరకు, 31నుంచి 45వరకు, 45నుంచి 60వ డివిజన్ వరకు ఇలా ప్రాంతాలు, రూట్ మ్యాప్‌తో సంబంధం లేకుండా డివిజన్లు కేటాయించారు. దీంతో మెప్మాలో కొత్తమహిళా సంఘాలు నిర్మాణం, వీధివ్యాపారుల ఏర్పాటు, స్వనిధి రుణాలు లక్ష్యం పక్కకు పోయింది. మెప్మాలో పంచాయతీల పర్వంగా మారింది. ఇప్పటికైనా రూట్‌మ్యాప్‌తో సీవోలకు డివిజన్లు కేటాయింపు జరిపితే ఎటువంటి పంచాయితీలు లేకుండా పట్టణ పేదరిక నిర్మూలనకు ముందుకు బాటలు పడ్తాయి.

ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్


గోదాము వద్ద కలెక్టర్ అనుదీప్

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): ఈవీఎం గోడౌన్ వద్ద పటిష్ట నిఘా ఉండాలని నిత్యం భద్రతా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోడౌన్ ను తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్ సీళ్లను పరిశీలించారు. అగ్నిమాపక పరికరాలు, సీసీ కెమెరాలను పరిశీలించి, పనిచేస్తున్నవి, లేనిది అడిగి తెలుసుకున్నారు. మొదటి అంతస్తులో నీరు నిల్వకుండా చేపడుతున్న పనులు పరిశీలించారు. కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి ఏ.పద్మశ్రీ,కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ ఎంఏ రాజు, ఎన్నికల డీటీ అన్సారీ, ఆర్అండ్‌బీ ఏఈ లలిత తదితరులు ఉన్నారు.

వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్

ఖమ్మంఅర్బన్ నవంబరు11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మికులకు సమగ్రచట్టం చేయటంతోపాటు ఉపాధి హామీ పథకంలో 200 రోజుల పనికల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు జరుపనున్నట్లు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్రిప్రసాద్ అన్నారు. మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ విధానాల ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీల స్థితిగతులుసంక్షోభంలోకి నెట్టివేయబడుతున్నాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ ఉద్యోగాలను తీసివేస్తున్నారని ఆరోపించారు. కార్పొరేట్‌శక్తులకు రూ.16లక్షల కోట్లను రద్దు చేయటం తప్పుడు చర్య అన్నారు. దేశవ్యాప్తంగా కార్మిక కర్షక, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమలను జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లానాయకులు యర్రాశ్రీనివాసరావు, వత్సవాయి జానకి రాములు, తాళ్లపల్లి కృష్ణ, కొండబోయిన నాగేశ్వరరావు, సంద్రప్రసాద్, జాజిరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రసాద్

పెన్షనర్ల బకాయిలను వెంటనే చెల్లించాలి

ఖమ్మంకలెక్టరేట్,నవంబరు11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆల్‌పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్‌రాష్ట్రసంఘం పిలుపుమేరకు ఖమ్మం జిల్లా శాఖ మంగళవారం రిలేనిరాహార దీక్షలను చేపట్టారు. పెన్షనర్ల పెండింగ్ సమస్యల పరిష్కారం చేయాలంటూ దీక్షలను చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా శాఖ గౌరవ అధ్యక్షుడు మల్లికార్జునరావు ప్రారంభించారు. అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్ గోపీచంద్, కళ్యాణంనాగేశ్వరరావు మాట్లాడుతూ18 నెలల క్రితం నుంచి రిటైర్ అయిన ఉద్యోగులకు రావలసిన బకాయలు చెల్లించకపోగా కనీసం వారు దాచుకున్న జీపీఎఫ్‌సొమ్ము కూడా నెలల తరబడి ఇవ్వకపోవడం దుర్మార్గమైన అంశమన్నారు. రిటైర్ అయిన ఉద్యోగస్తులకు చెల్లించాల్సిన బకాయిలన్నింటిని చెల్లించాలని నగదురహిత హెల్త్‌కార్డులను అందించాలని, 2023 జులై 1నుంచి ఆర్థిక ప్రయోజనాలు కలిగిన పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిరాహార దీక్షలో యూడీపీఎస్ రత్నకుమార్, వి అంజయ్య, హరిసింగ్, టి.మురళీధర్ రావు, చావా వెంకటేశ్వరరావు కూర్చున్నారు.శిబిరాన్ని శ్రీరాములు, వై రవి కుమార్, మాధవరావు, భారతిలు సంఘీభావం ప్రకటించారు. రేవా బాధ్యులు శ్రీ జైరామ్, లక్ష్మయ్య, రామారావు, శ్రీనివాస్‌రావు శిబిరాన్ని సందర్శించారు.


నిరసన తెలుపుతున్న రిటైర్డ్ ఉద్యోగులు

కల్లుగీత సంఘం సభలను జయప్రదం చేయండి

ఖమ్మంరూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల28,29,30 తేదీల్లో సూర్యాపేటలో జరగనున్న కల్లుగీత కార్మిక సంఘం నాలుగో రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లాప్రధాన కార్యదర్శి కొండం కరుణాకర్‌గౌడ్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని గోళ్లపాడు గ్రామంలో సంఘం కార్యాలయంలో మంగళవారం సంఘంసమావేశం నిర్వహించారు. జిల్లాలోని ఏజెన్సీ ఏరియాలలో రద్దయిన సొసైటీలను వెంటనే పునరుద్ధరించాలన్నారు. ఈ సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు ఆంజనేయులు, సంపయ్య, కృష్ణ, వెంకటేశ్వర్లు, సుదర్శన్, శంకర్, సత్యనారాయణ, వెంకటనారాయణ,సత్యం,మధు పాల్గొన్నారు.

విద్యార్థులకు బూట్లు పంపిణీ

ఖమ్మంరూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పోన్నేకల్లు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పీఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం బూట్లు అందజేశారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు వెంకటరెడ్డి,మల్లారెడ్డి,బండి జగదీష్, పంతులు నాయక్, రవి, రాము,ఉప్పలయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రమేష్, హనుమంతు, గోపి తదితరులు పాల్గొన్నారు.

అందెశ్రీకి నివాళులు

ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి అందెశ్రీకి జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నివాళులర్పించారు. తొలుత టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తొలుత అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్రప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, రాష్ట్రకార్యవర్గసభ్యుడు మాటేటి వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి మైసాపాపారావు, స్తంభాద్రి హౌజింగ్ సొసైటీ అధ్యక్షుడు కనకంసైదులు, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నామా పురుషోత్తం, కళ్యాణ్ పాల్గొన్నారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు ఆధ్వర్యంలో అమర వీరుల స్థూపంవద్ద తెలంగాణ అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.ఈకార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి, తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమాలు

తిరుమలాయపాలెం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కా అమర వీరులస్ఫూర్తితో ఉద్యమాలు చేపడుతున్నట్టు మాస్‌లైన్ జిల్లానాయకుడు ఆర్.శివలింగం పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని తిమ్మక్కపేటలో అమర వీరులవారోత్సవాల సందర్భంగా మాట్లాడారు. రాయల సుభాష్ చంద్రబోస్,శ్రీపాదశ్రీహరి, దొరన్న, ధర్మన్న, యల్లన్న తదితరులు ప్రజాసమస్యల పరిష్కారానికి అనేక ఉద్యమాలుచేసి అసువులు బాశారన్నారు.ఈ సమావేశంలో చుంచు బిక్షం. చుంచు వెంకన్న, పెద్దబిక్షం, బద్రయ్య, కృష్ణ, వెంకన్న పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తిరుమలాయపాలెం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి.మోహన్‌రావు తెలిపారు. మంగళవారం తిరుమలాయపాలెంలో సీఐటీయూ 8వ మండల మహాసభలో మాట్లాడుతూ కార్మికులు పోరాడి సదించుకున్న హక్కులను పాలకులు హరించివేస్తున్నారన్నారు. పాలకులు అనేక వాగ్దానాలు చేసి వాటిని విస్మరిస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో ఎస్‌కే బషీరుద్దీన్, వశపొంగు వీరన్న, కొమ్ము శ్రీను,పద్మ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

తిరుమలాయపాలెం, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలని ఏడీఏ సతీష్ తెలిపారు. మంగళవారం మండలంలోని జూపెడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. పాతర్లపాడులోని కాటన్‌మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో సీతారాంరెడ్డి, మద్దులపల్లి ఏఎంసీ వైస్‌చైర్మన్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



సీఎం ఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఖమ్మంఅర్బన్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చొరవతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంగళవారం ఖమ్మంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. పాలేరు నియోజక వర్గానికి చెందిన 83మందికి రూ.29లక్షల చెక్కులను మంత్రి క్యాంపు కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి అందించారు.

రైతులకు పంట నష్ట పరిహారం చెల్లించాలి

బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి



నేలకొండల్లి, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేసారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పాడైపోయిన పంట పొలాలను మంగళవారం నాయకులు పరిశీలించారు. మండల పరిధిలోని పైనంపల్లి గ్రామంలో పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. పంట నష్టాన్ని అధికారులతో అంచనావేయించి, రైతులను ఆదుకోవాలని సుధాకర్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు, ప్రచార కార్యదర్శి సూరేపల్లి జ్ఞానరత్నం పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాల్లో ఎస్‌బీఐటీ విద్యార్థుల ఎంపిక

ఖమ్మంఖానాపురం హవేలి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ అకాడమీ ఫర్‌స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) వారి సహకారంతో నిర్వహించిన టెలిపర్ఫార్మెన్స్ ప్రాంగణ నియామకాల్లో తమ కళాశాలకు చెందిన 70మంది ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఎంపికైన విద్యార్థులు కస్టమర్ సర్వీస్ అసోసియేట్, కంటెంట్ మోడరేటర్, అనలిస్ట్ హోదాలో ఉద్యోగాలు నిర్వహిస్తారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.ధాత్రి తెలిపారు. ఈ ప్రాంగణ నియామకాలకు సహకరించిన టాస్క్ జిల్లా మేనేజర్ పి.దినేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

రేపు ముదిగొండలో డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

ముదిగొండ, నవంబరు11(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క గురువారం ముదిగొండ మండలంలో పర్యటించనున్నారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు తెలిపారు. మండలంలోని గంధసిరి గ్రామంలో శ్రీ సుందర మౌళేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి భట్టి విక్రమార్క శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మద్దతు ధర పొందాలి

ముదిగొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వరిధాన్యం పండించిన రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించుకొని మద్దతు ధర పొందాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సూచించారు. మంగళవారం మండలం వల్లభిలో డీసీఎంఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్లు తుపాకుల యలగొండస్వామి, సామినేని వెంకటయ్య, తహసీల్దార్ సునీత ఎలిజెత్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, ఏఎంసీ వైస్‌చైర్మన్ పర్సగాని తిరుపతిరావు, పసుపులేటి దేవేంద్రం, బిచ్చాల బిక్షం, చిమ్మసత్తి ఎల్లయ్య, ఏలూరి భాస్కర్, సంగీతరావు, బిచ్చాల అన్వేష్, వల్లూరి భద్రారెడ్డి, రామవరెడ్డి పాల్గొన్నారు.

ఆర్యవైశ్య ప్రముఖురాలు భద్రమ్మ హఠాన్మరణం

కల్లూరు, నవంబరు11(ఆంధ్రజ్యోతి): కల్లూరులో ఆర్యవైశ్య ప్రముఖురాలు పసుమర్తి భద్రమ్మ(75) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. జిల్లాఆర్యవైశ్య మహాసభ సత్తుపల్లి నియోజకవర్గ బాధ్యులు, ప్రముఖ వ్యాపారవేత్త పసుమర్తి రాంబాబు మాతృమూర్తి అయిన భద్రమ్మ మృతితో విషాదం నెలకొన్నది. కాంగ్రెస్‌లో ఉన్న ఆ కుటుంబం తరపున భద్రమ్మ భర్త వీరయ్య కూడా రాజకీయంగా నలభై సంవత్సరాల క్రితంసర్గీయ మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావుతోసన్నిహిత సంబంధాలు ఉన్నాయి.

అగ్రిమెంట్ ఇచ్చిన మొక్కజొన్న విత్తనాలనే విత్తుకోవాలి: ఏవో

పెనుబల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అగ్రిమెంట్ ఇచ్చిన విత్తన మొక్కజొన్నలే విత్తుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఏవీఎస్.ప్రసాదరాజు తెలిపారు. మంగళవారం పెనుబల్లి మండలం తాళ్లపెంట గంగదేవిపాడు గ్రామాల్లో మొక్కజొన్న సాగుచేసే రైతులకు విత్తన మొక్కజొన్న పంట సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు మోసపోకుండా ఉండేందుకు కంపెనీల ఆర్గనైజర్లతో అగ్రిమెంట్ చేసుకోవాలని రైతులకు గతంలోనే అవగాహన కల్పించామన్నారు. రైతులు మోసపోకుండా ఉండేందుకు ఆర్గనైజర్లతో ఒప్పంద పత్రం రాయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

డీలర్లు నిబంధనలు పాటించాలి: ఏడీఏ

మధిర రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగు మందు, విత్తన డీలర్లు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఏడీఏ విజయ్‌చందర్ హెచ్చరించారు. మంగళవారం మధిర రైతువేదికలో ఎరువులు, విత్తనాల డీలర్లు, సొసైటీల సీఈవోలతో సమావేశాన్ని నిర్వహించారు. ఎరువులను పీవోఎస్ మిషన్ ద్వారానే అమ్మాలని, ప్రతిరోజూ స్టాక్ రిజిస్టర్లు అమలుచేయాలని సూచించారు. డీలర్లు స్టాక్‌ను ప్రదర్శించాలని సూచించారు. రాబోయే యాసంగిలో యూరియాను రైతుల విస్తీర్ణం ప్రకారం ఎలాంటి ఇబ్బందులు సరఫరా చేయాలని సూచించారు. ఏవో సాయి దీక్షిత్, ఏఈవోలు, డీలర్లు పాల్గొన్నారు.

పత్తి వేసిన కౌలు రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

పత్తి కొనుగోళ్లలో కపాస్ కిసాన్ యాప్ ద్వారా రైతులు తమ పేర్లు నమోదు చేయించుకున్నారని, కౌలురైతుల రిజిస్ట్రేషన్ కోసం ఏఈవోను సంప్రదించి పత్తిని అమ్ముకోవాలని ఏడీఏ విజయ్‌చందర్ సూచించారు.

ఎత్తిపోతల పథకం పనుల పరిశీలన

చింతకాని, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కొదుమూరు-వందనం ఎత్తిపోతల పథకం రెండవ దశ పనులను త్వరలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రారంభించనున్న సందర్భంగా శిలాఫలకాన్ని, సభాస్థలాన్ని మంగళవారం కాంగ్రెస్ మండల నాయకులు పరిశీలించారు. రెండవ దశ వందనం, కొదుమూరు, రాఘవాపురం, లచ్చగూడెం గ్రామాల వ్యవసాయ భూములకు సాగు నీరు అందించనుందని మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్, మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ సురేష్, నాయకులు ఆవుల నాగేశ్వరరావు, కన్నెబోయిన గోపి, మడుపల్లి భాస్కర్, కూరపాటి కిషోర్, కొప్పుల గోవిందరావు, పెంట్యాల అప్పారావు, పాశం సంజీవరెడ్డి, కొల్లి గోవిందరావు, కొల్లి సీతయ్య పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

తల్లాడ, నవంబరు11(ఆంధ్రజ్యోతి): తల్లాడలో మంగళవారం మదర్ థెరిస్సా హెల్పింగ్‌హ్యాండ్స్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. శీతాకాలం సందర్భంగా స్థానిక వాసవీ కల్యాణ మండపంలో పేదలు దుప్పట్లు పంపిణీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు కొత్తూరు ఫణీంద్ర, షేక్ షఫి, మొక్క కృష్ణార్జునరావు, పెండెం లక్ష్మీనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు ముదిగొండలో డిప్యూటీ సీఎం భట్టి పర్యటన

ముదిగొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క గురువారం ముదిగొండ మండలంలో పర్యటించనున్నారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు తెలిపారు. మండలంలోని గంధసిరి గ్రామంలో శ్రీ సుందర మౌలేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి భట్టి విక్రమార్క శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆలయంలో అన్నదానం

సత్తుపల్లిరూరల్, నవంబరు 11 (ఆం ధ్రజ్యోతి): అన్నదానం చేయడంతో దాతలకు ఆధ్యాత్మిక, సంతృప్తి కలుగుతుందని శ్రీ మెట్టాంజనేయాలయ అధ్యక్ష,కార్యదర్శులు సాధు శివ, మల్లూరు అంకంరాజులు అన్నారు. మంగళవారం స్థానిక వేంసూరు రోడ్‌లోని శ్రీ కోదండ సీతారామ లక్ష్మణ సమేత మెట్టాంజనేయ స్వామి వారి ఆలయంలో భక్తులకు దాతలు కనిగోళ్ల గోపాలకృష్ణ కుటుంబ సభ్యులు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కాల్నేని కాంతారావు, చీపు సురేష్, గోగినేని వెంకటేశ్వరరావు, రంగపురి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ అధికారులు అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారు

» రిటైర్డ్ ఎంఈవో అనుమోలు భాస్కర్‌రావు

మధిర రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మధిర మునిసిపాలిటీ అధికారులు అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారని, ఎలాంటి డాక్యుమెంట్లు లేకపోయినా ఓ వ్యక్తికి ఇంటినెంబర్ కేటాయించారని మధిర రిటైర్డ్ ఎంఈవో అనుమోలు భాస్కర్‌రావు ఆరోపించారు. మంగళవారం మధిరలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024లో కళామందిరం వీధిలో 254గజాల స్థలాన్ని తాను గింజుపల్లి శంకరయ్య, కిలారు మార్కేండయ్య దగ్గర కొనుగోలు చేయగా.. అది తనకు రిజిస్ట్రేషన్ అయిందన్నారు. అయితే మధిరకు చెందిన చెరుకూరి నాగార్జున అనే వ్యక్తి ఎటువంటి డాక్యుమెంట్లు లేకుండానే తన పేరిట ఉన్న స్థలంపై మునిసిపల్ అధికారుల అండతో ఇల్లు ఉన్నట్టు పత్రాలు సృష్టించి డోర్‌నెంబర్ కూడా తీసుకున్నాడని ఆరోపించారు. 2021లో అప్పటి కమిషనర్, ఆర్ఐలు ఈ స్థలానికి డోర్‌నెంబర్ కేటాయించటం అన్యాయమన్నారు. కలెక్టర్ దృష్టిసారించి మునిసిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని త్వరలోనే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి కూడా తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు.

మద్దతు ధర పొందాలి

» కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్

ముదిగొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వరిధాన్యం పండించిన రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించుకొని మద్దతు ధర పొందాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సూచించారు. మంగళవారం మండలం వల్లభిలో డీసీఎంఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్లు తుపాకుల యలగొండస్వామి, సామినేని వెంకటయ్య, తహసీల్దార్ సునీత ఎల్జిబెత్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, ఏఎంసీ వైస్‌చైర్మన్ పర్సగాని తిరుపతిరావు, పసుపులేటి దేవేంద్రం, బిచ్చాల భిక్షం, చిమ్మసత్తి ఎల్లయ్య, ఏలూరు భాస్కర్, సంగీతరావు, బిచ్చాల అన్వేష్, వల్లూరి భద్రారెడ్డి, రాఘవరెడ్డి, ఫుల్లారెడ్డి, పందిరి అంజయ్య, సీసీ రామారావు, పాల్గొన్నారు.

రోడ్డు పనులకు మరమ్మతులు

కారేపల్లి, నవంబరు11(ఆంధ్రజ్యోతి): ఖమ్మం-ఇల్లెందు ప్రధాన రహదారిలో కోమ్ముగూడెం, గాంధీనగరం, సీతారాం పురం వద్ద ఏర్పడిన పెద్దగుంతలను ఎట్టకేలకు ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి మరమ్మతుపనులు చేపట్టారు. రెండు రోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో వచ్చిన అటుఇటు అయితే ఆపదలో పడాల్సిందే అనే వార్త కథనానికి స్పందించిన అధికారులు కదలి వచ్చి గుంతలను పూడ్చి మరమ్మతులు చేపట్టారు.

విద్యతోనే పేదరికానికి విముక్తి

(5వ పేజీ తరువాయి)

అరబిక్, బెంగాలీ, ఇంగ్లీష్ భాషలలో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ పండితుడని, 11 సంవత్సరాల పాటు విద్యాశాఖ మంత్రిగా పని చేశారన్నారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలు చదువుకోవాలని ఆశయంతో కుల మత భేదాలు లేకుండా పని చేశారన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలను గుర్తించిన ప్రభుత్వం 1992లో భారతరత్న అవార్డు అందజేసి గౌరవించిందని కలెక్టర్ అన్నారు. విద్యతో మాత్రమే పేదరికం దూరమవుతుందని భావించి ప్రతీ పేదవాడికి విద్య అందే దిశగా చర్యలు తీసుకున్నారన్నారు. వ్యక్తిగతంగా మతపరమైన సంప్రదాయాలు పాటిస్తూ మనమంతా భారతదేశంలో భాగమని తెలిపారన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మైనారిటీ విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టి గురుకులాలను ఏర్పాటు చేసింది, మైనారిటీ బాలికల విద్యపై దృష్టి సారించి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బికళావతి బాయి, జిల్లా మైనార్టీ శాఖ అధికారి ముజాహిద్, కలెక్టరేట్ ఏవో కారుమంచి శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సకాలంలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

» అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



కల్లూరులో రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

తల్లాడ/కల్లూరు, నవంబరు11(ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా పత్తి, ధాన్యం కొనుగోలు పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం తల్లాడ, కల్లూరు మండలాల్లో ఆయన పర్యటించారు. సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం, ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీచేసి కొనుగోలు పరిశీలించారు. తల్లాడలోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీచేశారు. పత్తి కొనుగోళ్లను పరిశీలించి, ట్యాబ్ ఎంట్రీ, పంట నమోదులను తనిఖీచేవారు. కొనుగోలుకు వచ్చిన పత్తిని తేమ యంత్రంతో తేమశాతం పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తల్లాడలోని వెంకట పద్మావతి రైస్‌మిల్‌ను తనిఖీచేశారు. ధాన్యం దిగుమతి,ట్రక్ షీట్ల నమోదుకు పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలనుండి వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే ఆన్‌లోడ్ చేసుకోవాలని మిల్లర్‌కు సూచించారు. తల్లాడ మండలంలోని నూతన్‌కల్, రంగంబంజర గ్రామాల్లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీచేశారు.రోజుకు ఎంత మేర ధాన్యం కేంద్రాలకు వస్తున్నది, ఎంతమేర రవాణ చేస్తుంది రైతులకు కలిపిస్తున్న వసతుల గురించి ఆరాతీశారు. రైతులతో మాట్లాడి కొనుగోళ్లలో సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అధికారులు రైతుల నుంచి కొనుగోలుచేసిన ధాన్యాన్ని ట్యాబ్ ఎంట్రీ వెంట వెంటనే చేపట్టాలని, రైతులకు వారి ధాన్యం మొత్తం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.తేమ శాతం చూసుకొని కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకొని రావాలని రైతులను కోరారు. కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత ట్యాబ్ ఎంట్రీ వెంటనే చేపట్టాలని నిర్వహకులను సూచించారు. ఎర్రబోయినపల్లిలో తడిసిన ధాన్యం కొనుగోలు చేసేలా అధికారులు దృష్టి సారించాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా సహకార అధికారి గంగాధర్, జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ గంటా శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



బీమా చెక్కు అందజేస్తున్న చైర్మన్ యలగొండస్వామి

ముదిగొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం పెద్దమండవకు చెందిన రైతు గుండెపోగు పుల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందడంతో మంగళవారం సొసైటీ కార్యాలయంలో ఆయన భార్య సులోచనకు రూ.50వేల బీమా చెక్కును చైర్మన్ తుపాకుల యలగొండ స్వామి అందజేశారు. ప్రభుత్వం రైతులేకాకుండా రైతు కుటుంబాలను కూడా ఆదుకుంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బాషా, జానిమియా, శ్రీను, సతీష్, ప్రసాద్, లక్ష్మయ్య, మధు, రమ్య పాల్గొన్నారు.

రేజర్ల శివాలయంలో ఘనంగా దీపోత్సవం

సత్తుపల్లిరూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా మండలంలోని రేజర్ల శ్రీ దుర్గా నాగమల్లేశ్వర స్వామివార్ల క్షేత్రంలో సోమవారం రాత్రి దీపోత్సవం కన్నులపండువగా సాగింది. గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణ శివనామస్మరణతో మారుమ్రోగింది.



దేదీప్యమానంగా వెలుగుతున్న దీపాలు

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం



సత్తుపల్లి మునిసిపాలిటీలో ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కమిషనర్

సత్తుపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విభిన్న విధానాలతో దేశంలో విద్యారంగాభివృద్ధికి ఆజాద్ ఎంతగానో కృషి చేశారని సత్తుపల్లి మునిసిపల్ కమిషనర్ కొండ్రా నర్సింహ అన్నారు. జాతీయ విద్యా దినోత్సవాన్ని మంగళవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈ నరేష్, టీపీఎస్ శ్రీనివాస్, మెప్మా ఆర్‌పీ బజ్జూరి నరేష్, పాల్గొన్నారు.

మధిర రూరల్: స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన మౌలానా అబ్దుల్‌కలాం ఆజాద్ మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ జయదాస్, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు హసీనాబేగం, ఉపేందర్, కమల, అరుణ, లాలయ్య పాల్గొన్నారు.

కొణిజర్ల: మండల పరిధిలోని తనికెళ్ల సమీపంలో గల మైనారిటీ గురుకుల పాఠశాలలో మంగళవారం మౌలానా అబ్దుల్‌కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంఈవో అబ్రహం హాజరై అబ్దుల్‌కలాం ఆజాద్‌చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిఆపల్ జితేష్‌పాటిల్, కళాశాల కో ఆర్డినేటర్ కొండలరావు, అనిత, క్రాంతి కుమార్, యాకుబ్‌పాషా తదితరులున్నారు.



బోనకల్‌లో....



మధిరలో...

కారేపల్లి: మౌలానా అబ్దుల్ కలాం అజాద్ జన్మదినాన్ని పురష్కరించుకుని మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ధార సావిత్రి ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవ కార్యాక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ ఏ.రమేష్, ట్రైని ఎస్ఐ నవిత, మాజీ ఎస్ఆర్పీ ఎండి బాబు పాల్గొన్నారు.

బోనకల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం దివంగత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నళినిశ్రీ, ఎన్ఎస్ఎస్ కోఆర్డీనేటర్ అంతోటి తిరుపతిరావు, రాజేంద్రకుమార్, లక్ష్మీకాంతం, పద్మావతి, ప్రేమ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పోటీలతో నైపుణ్యాల పెంపు

సత్తుపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించేందుకు తల్లిదండ్రులు వారిని బాల్యం నుంచే ప్రతిభాపాటవ పోటీల వైపు ప్రోత్సహించాలని ఎన్టీఆర్ నగర్ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం ఎన్.రామ్మోహనరావు అన్నారు. టీ-శాట్, టీఎస్‌జీహెచ్ఎంఏ సంయుక్తంగా జిల్లా స్థాయిలో మంగళవారం ఖమ్మంలోని డీఈఓ కార్యాలయంలో నిర్వహించిన పోటీలలో డిబేట్‌లో పీ.దుర్గాచరణ్, క్విజ్‌లో విమల్ కిరణ్, దుర్గాచరణ్, రాఘవేంద్ర, నయామ్ ప్రతిభ చూపారన్నారు. ఈ సందర్భంగా విజేతలను, ఎంఈవో నక్కా రాజేశ్వరరావు, కాంప్లెక్స్ హెచ్ఎం ఆర్‌శైలకుమారిలు అభినందించారు.



సత్తుపల్లి విజేతలను అభినందిస్తున్న అధికారులు



మధిరలో...

మధిర రూరల్: సదిశ ఫౌండేషన్ ఖమ్మం వారి ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్వహించిన టాలెంట్ టెస్టులో మధిర మండలం మర్లపాడు, మాటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ సాధించారు. మాటూరు హైస్కూల్‌కు చెందిన వేముల సిరిచందన జిల్లాస్థాయిలో నాల్గో ర్యాంకు, రాష్ట్రస్థాయిలో 49వ ర్యాంకు సాధించింది. అలాగే మర్లపాడు హైస్కూల్‌కు చెందిన తోట లోహిత జిల్లాస్థాయిలో ప్రథమ, రాష్ట్రస్థాయిలో నాల్గో ర్యాంకు సాధించింది. ఈ విద్యార్థులను పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

సన్నధాన్యం బోనస్‌ను విడుదల చేయాలి

» సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం



సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రం

వైరా, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గత యాసంగి సీజన్‌కు సంబంధించిన సన్నధాన్యం బోనస్ రూ.63.63కోట్లు విడుదల చేయాలని వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. మాజీ ఎంపీపీ బొంతు సమత అధ్యక్షతన మంగళవారం జరిగిన సీపీఎం వైరా పట్టణ కమిటీ సమావేశంలో వీరభద్రం మాట్లాడారు. ఈ ఏడాది మళ్లీ వానాకాలం వ్యవసాయ సీజన్ ముగిసి రబీ వ్యవసాయ సీజన్ మొదలైనప్పటికీ గత యాసంగి సీజన్ సన్నరకాల ధాన్యం బోనస్ సొమ్ము చెల్లించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. సీసీఐ పత్తి కొనుగోళ్లపై ఉన్న నిబంధనలు ఎత్తివేయాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని, అధిక వర్షాలతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సుంకర సుధాకర్, పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు పాల్గొన్నారు.

నాణ్యమైన పత్తిని తీసుకురావాలి



తేమశాతం పరిశీలిస్తున్న అధికారులు

కారేపల్లి, నవంబరు11(ఆంధ్రజ్యోతి): సీసీఐ కేంద్రానికి పత్తి విక్రయానికి తీసుకువచ్చే రైతులు తేమశాతం 12 లోపులో ఉండేలా చూడాలని ఇల్లెందు వ్యవసాయమార్కెట్ కార్యదర్శి ఎన్.నరేష్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సీసీఐ కేంద్రానికి వచ్చిన పత్తిని మిషన్‌తో పాసింగ్‌చేసి అనుకూలంగా ఉన్న పత్తిని మిల్లులోకి అనుమతిస్తున్నారు. ఈసందర్భంగా నరేష్ కుమార్ మాట్లాడుతూ రైతులు తమ పత్తిని తీసుకువచ్చే ముందు తేమశాతం 12లోపులో ఉండేలా చూడాలన్నారు. రైతులు ముందుగా తమ పత్తిని తీసుకువచ్చే ముందు కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

» సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తమాల ప్రసాద్

వైరా, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తమాల ప్రసాద్ విమర్శించారు. పాపగంటి రాంబాబు అధ్యక్షతన మంగళవారం జరిగిన సీఐటీయూ పట్టణ కమిటీ మహాసభలో ప్రసాద్ మాట్లాడారు. సీఐటీయూ సీనియర్ నాయకుడు షేక్.జమాల్ సీఐటీయూ పతాకాన్ని ఆవిష్కరించారు. మహాసభ అనంతరం సీఐటీయూ వైరా పట్టణ కమిటీ కన్వీనర్‌గా అనుమోలు రామారావుతోపాటు 16మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు భూక్యా వీరభద్రం, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, చెరుకుమల్లి కుటుంబరావు, బాజోజు రమణ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ముత్తమాల ప్రసాద్

ఆర్యవైశ్య ప్రముఖురాలు భద్రమ్మ మృతి



భద్రమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న చందర్‌రావు

కల్లూరు, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణంలో ఆర్యవైశ్య ప్రముఖురాలు పసుమర్తి భద్రమ్మ(75) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ సత్తుపల్లి నియోజకవర్గ బాధ్యులు, ప్రముఖ వ్యాపారవేత పసుమర్తి రాంబాబు మాతృమూర్తి అయిన భద్రమ్మ మృతితో ఆ కుటుంబంలో విషాదం నెలకొన్నది. కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఆ కుటుంబం తరఫున భద్రమ్మ భర్త వీరయ్య కూడా రాజకీయంగా గత నలభై సంత్సరాల క్రితం సర్గీయ మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావుతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు, చారుగుండ్ల అమృతసీతారామారావు, దోసాపాటి కృష్ణార్జునరావు, కొప్పురావూరి అంజనేయులు, చారుగుండ్ల సందీప్, సముద్రాల పుల్లారావులతో పాటుగా పలువురు రాజకీయ నాయకులు, వ్యాపార ప్రముఖలు భద్రమ్మ కుమారులైన పసుమర్తి రాంబాబు, శ్రీనులను పరామర్శించారు. భద్రమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి సంతాపం తెలిపారు.

సీపీఐ సభను విజయవంతం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నరసింహారావు

కల్లూరు, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో డిసెంబరు 26న జరగనున్న సీపీఐ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సింగు నరసింహారావు పిలుపునిచ్చారు. కల్లూరులో మంగళవారం మండల సీపీఐ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఖమ్మం సీపీఐ మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అ నంతరం జరిగిన సమావేశంలో సింగు మాట్లాడుతూ దేశంలో వంద సంత్సారాల చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ మాత్రమేనని అన్నారు. దేశ ప్రజల, రైతుల కోసం ఎందరో అమర వీరుల త్యాగాలతో కమ్యూనిస్టు పార్టీ ముందుకు సాగుతున్నదని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుద్యోగం పెరిగిందని, సామాన్యుడు బతకలేని పరిస్థితిలో ధరలు పెరిగాయని విమర్శించారు. ప్రజా స్వామ్యానికి విఘా తం కలిగేలా బీజేపీ పాలన సాగుతుదని ఆరోపించారు. కార్మిక వర్గ రాజ్య స్థాపన కోసం తమ పార్టీ పనిచేస్తుందన్నారు. డిసెంబరు 26న 5 లక్షల మందితో 100 వంసంతాల ఉత్సవ బహిరంగ సభను నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు, మండల కార్యదర్శి దమాల దయాకర్ రావు తదితరులున్నారు.

అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు: తహసీల్దార్

ఎర్రుపాలెం, నవంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇసుక రేవుల్లో ఇందిరమ్మ ఇళ్లకు మాత్రమే ఇసుక కూపన్లు జారీచేశామని, ఇందిరమ్మ ఇళ్ల పేరుతో వేరే నిర్మాణాలకు అక్రమంగా ఇసుక తరలిస్తే అక్రమార్కులపై ఉక్కుపాద మోపుతామని తహసీల్దార్ మన్నె ఉషాశారద మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్లలబ్ధిదారుల సౌకర్యార్థం కోసం మీనవోలు రేవుతోపాటు తక్కెళ్లపాడు, సఖినవీడు గ్రామాలల్లో ఇసుక రేవులకు కూడా కూపన్లు జారీ చేసినట్టు తెలిపారు. కేవలం ఇందిరమ్మ ఇళ్లకు మాత్రమే ఇసుక కూపన్లు జారీచేశామని, ఇసుక తరలించే క్రమంలో ట్రాక్టర్లు వెనులుబాటు కోసం ఇసుక రేవుల్లో జేసీబీ వగైరా మిషన్లతో ఇసుక తోడితే చట్టపరంగా చర్యలుంటాయన్నారు.

ఇసుక అక్రమరవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, ఇసుక అక్రమరవాణ చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు.

మత్స్యకారులకు గుర్తింపు కార్డుల పంపిణీ

కారేపల్లి, నవంబరు11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గేటుకారేపల్లిలలో మంగళవారం నూతనంగా ఎంపికైన మత్స్యసొసైటీ సభ్యులుకు గుర్తింపుకార్డులు పంపిణీ చేశారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో మండల సహకార సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాస్‌రావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.అనూష, జిల్లా కాంగ్రెస్ నాయకులు బానోత్ రాంమూర్తి, తిరుపతయ్య, చెరుకూరి వెంకటేశ్వర్లు, జక్కుల కుమార్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన

ముదిగొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ముదిగొండలో మంగళవారం వైఆర్‌జీకేఆర్ ఆధ్వర్యంలో హెచ్ఐవీ ఎయిడ్స్, క్షయ వ్యాధులపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ప్రజలు సుఖ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. 18సంవత్సరాలు నిండిన వారు ప్రతి ఒక్కరూ ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని సూపర్‌వైజర్ నందిని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, పాల్గొన్నారు.